ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
జయశంకర్ భూపాలపల్లి
మంగళవారం 28 జనవరి 2025



పురపాలకాల్లో.. ప్రత్యేక పాలన





హనుమకొండ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : పురపాలక సంఘాల పాలకవర్గాల పదవీకాలం 26వతేదీతో పూర్తవడంతో.. సోమవారం నుంచి పాలనాపగ్గాలు ప్రత్యేకాధికారుల చేతుల్లోకి వెళ్లాయి. ఈ పురపాలికలకు అదనపు కలెక్టర్లను (స్థానిక సంస్థలు) నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో తొమ్మిది మునిసిపాలిటీలు ఉన్నాయి. వీటిలో పరకాలకు హనుమకొండ అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, భూపాలపల్లికి విజయలక్ష్మి ప్రత్యేకాధికారులుగా నియమితులుకాగా, మహబూబాబాద్ జిల్లా పరిధిలోని నాలుగు పురపాలక సంఘాలైన మహబూబాబాద్, మరిపెడ, డోర్నకల్, తొర్రూరులకు లెనిన్ వత్సల్ టొప్పో, నర్సంపేట, వర్ధన్నపేటలకు సంధ్యారాణి, జనగామకు పింకేష్ కుమార్ ప్రత్యేకాధికారులుగా నియమితులయ్యారు. వీరంతా సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

2020లో ఎన్నికలు

ఈ తొమ్మిది మునిసిపాలిటీలకు 2020లో ఎన్నికలు జరిగాయి. అదే నెల 27న పాలకవర్గాలు కొలువుదీరాయి. ఈనెల 26న పురపాలక సభ్యుల పదవీకాలం ముగిసింది. ఇప్పట్లో ఎన్నికలు జరిగే అవకాశం లేదు. ఇప్పటికే గ్రామ పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్‌ల సభ్యుల పదవీకాలం ముగిసి ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతున్న విషయం తెలిసిందే. పంచాయతీ, ఎంపీ టీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరిగిన తర్వా తే ముని సిపాలిటీలకు నిర్వహి స్తారు. దీనికి కనీసం ఆరు నెలల సమయం పట్టే అవకాశముండటం తో అప్పటి వరకు పురపాలికల్లో ప్రత్యేకాధికారుల పాలన తప్పనిసరి అయింది. రాష్ట్రంలో 2019 జులై 9న గత పాలకవర్గాల పదవీ కాలం ముగి సినా అప్పటి ప్రభుత్వం కొత్త మునిసిపల్ చట్టం తీసుకురావడం, ఓటర్ల గణన, వార్డుల విభజన, రిజర్వేషన్ల అమలు ప్రక్రియ పూర్తి చేసిన తర్వాతే ఎన్నికలు నిర్వహించింది. అప్పుడు కూడా ప్రత్యేకాధికారులను నియమించి ఆరు నెలల పాటు పాలన కొనసాగించింది.

విలీన గ్రామాలు విలవిల..

2020లో చట్టుపక్కల ఉన్న గ్రామాలను కలిపి మేజర్ పంచాయతీలను మునిసిపాలిటీలుగా బీఆర్ఎస్ ప్రభుత్వం చేసింది. డోర్నకల్, తొర్రూరు, మరిపెడ, వర్ధన్నపేట, భూపాలపల్లి అలా ఏర్పడిన మునిసిపాలిటీలే. పేరుకే ఇవి మునిసిపాలిటీలు అయ్యాయి కానీ అభివృద్ధి మాత్రం ఆశించిన స్థాయిలో జరగలేదు. విలీన గ్రామాల పరిస్థితీ మారలేదు. మునిసిపాలిటీల్లో బినామీ పేర్లతో పనులు చేసిన కౌన్సిలర్లు, చైర్మెన్లకు, కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులు జరగకపోవడంతో విలీన గ్రామాల్లో పనులు నిలిచిపోయాయి. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు చేతులెత్తేశారు. టెండర్లు పిలిచినా ముందుకు రాలేదు. ప్రజాప్రతినిధులు బిల్లుల కోసం అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా ఫలితం లేకుండా పోయింది.

- 26తో ముగిసిన పాలకవర్గాల గడువు
- బాధ్యతలు స్వీకరించిన స్పెషల్ ఆఫీసర్లు
- ఉమ్మడి జిల్లాలో తొమ్మిది మునిసిపాలిటీలు
- అధికారులకు అదనపు బాధ్యతతో కొరవడనున్న పర్యవేక్షణ
- పూర్తిస్థాయిలో కమిషనర్లూ లేని వైనం
- గత అయిదేళ్లలో అభివృద్ధిలో వెనక్కు
- నిధులు రాక నిలిచిన పలు పనులు
- బిల్లుల కోసం తిరుగుతున్న కౌన్సిలర్లు, చైర్మన్లు

గాడి తప్పిన పాలన...

ఉమ్మడి జిల్లాలో మునిసిపాలిటీల్లో దాదాపు అన్ని స్థానాలు బీఆర్ఎస్ కైవసం చేసుకున్నా ఆ అయిదేళ్ల పాలనలో చెప్పుకోదగ్గ ప్రగతి జరగలేదు. 2020లో కరోనా కారణంగా ఏడాదిన్నర కాలం అభివృద్ధి నిలిచిపోయింది. అనంతరం పురపాలికల్లో సమీకృత భవనాలు, డంపింగ్ యార్డులు, మురికికాలువలు, సీసీ రోడ్లు, ఇతర అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినా పూర్తి స్థాయిలో రాష్ట్ర ఆర్థిక సంస్థల నుంచి నిధులు రాకపోవడంతో అసంపూర్తిగా మిగిలాయి. పట్టణ ప్రగతి కింద ప్రతినెల నిధులు రావడంతో త్వరిత గతిన బిల్లులు విడుదలవుతాయని భావించి కౌన్సిలర్లు కాంట్రాక్టర్ల అవతారం ఎత్తి పనులు చేశారు. కొందరు చైర్మన్లు బినామీ పేర్లతో పనులు చేశారు. 2024 డిసెంబర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా పట్టణ ప్రగతి పట్టాలు ఎక్కలేదు. నిధులూ విడుదల కాలేదు. ఏడాది నుంచి పనులు ఎక్కడివక్కడే నిలిచిపోయాయి.

ప్రత్యేకాధికారులైనా దృష్టి పెడతారా?

ప్రత్యేకాధికారుల పాలనలో అయినా ఈ మునిసిపాలిటీల పరిస్థితి మారేనా? ఎన్నికలు జరగడానికి ఆరునెలల కన్నా ఎక్కువ సమయం పట్టే అవకాశం ఉంది. ఈలోపు ప్రత్యేకాధికారులు మునిసిపాలిటీలపై ప్రత్యేక దృష్టి సారిస్తారా ? అన్న సందేహాలను ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. నిధులిస్తే తప్ప పనులు జరగవు. ఇప్పటికీ కాంట్రాక్టర్లకు కోట్ల రూపాయాల బిల్లులను చెల్లించాల్సి ఉంది. బకాయిలను చెల్లిస్తే తప్పా నిలిచిపోయిన పనులు తిరిగి ప్రారంభం కావు. అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) ఇప్పటికే అధిక పని భారంతో సతమతమవుతున్నారు. త్వరలో జరగే పంచాయతీ ఎన్నికలను వీరు పర్యవేక్షించాల్సి ఉంటుంది. అటువంటప్పుడు ఇక పురపాలనకు సమయం ఎక్కడ కేటాయిస్తారు. పైగా ఒక్కో అధికారికి రెండు కంటే ఎక్కువ పురపాలక సంఘాలను అప్పగించారు.

మహబూబాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పోకు నాలుగు పురపాలక సంఘాలు, వరంగల్ అదనపు కలెక్టర్‌కు రెండు మునిసిపాలిటీలకు స్పెషల్ ఆఫీసర్లుగా బాధ్యతలు అప్పగించారు. కొన్ని మునిసిపాలిటీలకు పూర్తి స్థాయి కమిషనర్లు కూడా లేరు. ఒక్కో కమిషనర్‌కు రెండు అంతకన్నా ఎక్కువ పురపాలక సంఘాల ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు. నర్సంపేట మునిసిపాలిటీకి గత ఎనిమిది నెలలుగా పూర్తి స్థాయి కమిషనర్ లేదు. ఇంతకు ముందు వర్ధన్నపేటకు పూర్తిస్థాయి నర్సంపేటకు ఇంచార్జి కమిషనర్‌గా ఉన్న జోనా వరంగల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. వర్ధన్నపేట మునిసిపాలిటీకి ఇమ్మడి సుధీర్ కుమార్‌ను పూర్తి స్థాయి కమిషర్‌గా నియమించినా నర్సంపేటకు మాత్రం జోనానే ఇన్‌చార్జ్‌గా కొనసాగుతున్నారు. పరకాల మునిసిపాలిటీకి మూడు నెలలుగా పూర్తికాలపు కమిషనర్ లేరు. పట్టణ ప్రణాళిక అధికారి (టీపీవో)నే ఇన్‌చార్జ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అంతకు ముందు కమిషనర్‌గా ఉన్న నర్సింహా గతేడాది అక్టోబరు 30న బాధ్యతల నుంచి రిలీవ్ అయ్యారు. ఆయనకు ప్రస్తుతం ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదని తెలిసింది. ఒక మిషనర్‌కు ఒకటి కన్నా ఎక్కువ పురపాలక సంఘాలను అప్పగించడంతో కూడా పురపాలనపై పూర్తి స్థాయిలో దృష్టిపెట్టే పరిస్థితి లేదు. దీంతో అటు కమిషనర్లు లేక ఇటు స్పెషల్ ఆఫీసర్లు చూడక మునిసిపాలిటీల పాలన గాడితప్పే పరిస్థితులున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వరంగల్ నగర పాలక సంస్థ పాలక వర్గం పదవీ కాలపరిమితి మరో ఏడాది ఉంది. 2021 ఫిబ్రవరి 1న పాలక వర్గం కొలువుదీరింది. దీనితో పదవీ కాలం ఉన్న వాటిని పక్కన బెట్టి పదవీ కాలం పూర్తయిన మునిసిపాలిటీలకు ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది.

ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

- ములుగు కలెక్టర్ దివాకర



ప్రజావాణిలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులను వచ్చే వారంరోజుల్లో పరిష్కరించాలని కలెక్టర్ టీఎస్.దివాకర అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరం లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొని 38 దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రతిష్టాత్మక నాలుగు పథకాలైన రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయభరోసా, నూతన రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ విజయవంతంగా అమలుచేయడంలో భాగస్వాము లైన గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు ఉన్న ప్రభుత్వ యంత్రాంగం సేవలు అభినందనీయమని అన్నారు. ఈనెల 16నుంచి 20వతేదీ వరకు క్షేత్రస్థాయి విచారణ, 21నుంచి 24వరకు గ్రామ సభల నిర్వహణలో ప్రజల సహకారం పట్ల ఆయన హర్షం వ్యక్తంచేశారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడంలో ప్రభుత్వ ఆశయం మేరకు ప్రతి ఒక్క ఉద్యోగి కృషి ప్రశంసనీ యమని, భవిష్యత్తులో కూడా ఇలాంటి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అర్హులైన పేదలకు అందించడంలో స్ఫూర్తితో పనిచేయాలన్నారు. అదే విధంగా ఫిబ్రవరి 12నుంచి 15వ తేదీ వరకు జరిగే సమ్మక్క-సారలమ్మ చిన్న జాతరకు అన్నిశాఖల అధికారులు సమన్వయంతో భక్తులకు ఎలాంటి ఇబ్బం దులు కలుగకుండా అన్ని మౌలిక సౌకర్యాలు ఏర్పాటుచేసి జాతర విజయవం తానికి కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంపత్‌రావు, ఆర్డీవో వెంకటేష్, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

● భూపాలపల్లి కలెక్టరేట్ : ప్రజల నుంచి వచ్చే వినతులను జవాబు దారితనంతో తక్షణమే పరిష్కరించాలని భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ రాహుల్‌శర్మ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చే ప్రతి దరఖాస్తును పరిశీలించి అర్జీదారులకు సమాధానం ఇవ్వాలన్నారు. మండల స్థాయిలో ప్రజావాణి నిర్వహిస్తున్నామని మండల పరిధిలో పరిష్కరం అయ్యే సమస్యలను తహసిల్దార్ కార్యాలయంలోనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుల పరిష్కారంకు ప్రతి శాఖలో ప్రత్యేకంగా నోడల్ అధికారులను నియమించాలన్నారు. ప్రజావాణిలో 89 దరఖాస్తులు వచ్చాయి. ప్రజావాణి దరఖాస్తులపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, కాటారం సబ్‌కలెక్టర్ మయాంక్‌సింగ్, ఆర్డీఓ రవి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సీతక్క కారు పాస్ ఫోర్జరీ

- కరీంనగర్‌కు చెందిన వ్యక్తి కారుపై గుర్తింపు
- ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ నాయకులు





ఎస్సైకి ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, కారు ముందు అద్దంపై అంటించిన స్టిక్కర్, కారులో బీజేపీ కండువా

ములుగు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రమంత్రి ధనసరి అనసూయ సీతక్కకు ప్రభుత్వం జారీచేసిన కారు పాస్ ఫోర్జరీ అయ్యింది. సీతక్క పేరిట అసెంబ్లీ సెక్రటరీ జారీచేసిన పాస్‌ను కరీంనగర్ జిల్లా చింతకుంటకు చెందిన దాసరి రవి తనకు చెందిన టీఎస్-02 ఈబీ 8239 నెంబర్‌గల కారుకు అంటించుకొని తిరుగుతున్నాడని, అతనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు వంగ రవియా దవ్, నాయకులు సోమవారం ములుగు ఎస్సై వెంకటేశ్వరరావుకు ఫిర్యాదు చేశారు. కారుకు అంటించిన స్టిక్కర్‌కు సంబంధించిన ఫొటోను పోలీసులకు అందజేశారు. ఆ ఫొటోలో కారు డ్యాష్‌బోర్డుపై బీజేపీ కండువా ఉండడం గమనార్హం. కొన్నిరోజులుగా ఈ కారు ములుగు, కరీంనగర్ ప్రాంతాల్లో ఎక్కువగా తిరుగుతుండటం, అందులో బీజేపీ కండువా ఉండడంతో గమనించిన కాంగ్రెస్ కార్యకర్తలు డీసీసీ అధ్యక్షుని దృష్టికి తీసుకువెళ్లారు. అంతర్గత విచారణలో కారు పాస్ ఫోర్జరీ జరగవచ్చని భావించిన నాయకులు పోలీసులను ఆశ్రయించారు. ఫిర్యాదు చేసిన వారిలో కాంగ్రెస్ ములుగు పట్టణాధ్యక్షుడు చింతనిప్పుల భిక్షపతి, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు కోటి తదితరులున్నారు.

గ్రామాల అభివృద్ధితోనే ప్రజల్లో మార్పు : ఎమ్మెల్యే



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

రేగొండ, జనవరి 27(ఆంధ్రజ్యోతి) : దేశంలో గ్రామాలు సంపూర్ణంగా అభివృద్ధి చెందినపుడే ప్రజల జీవనశైలిలో మార్పు వస్తుందని భూపాలపల్లి గండ్ర సత్యనారాయణరావు అన్నారు. కొత్తపల్లిగోరి మండలంలోని కొత్తపల్లి, నిజాంపల్లి గ్రామాలలో రోడ్ల నిర్మాణ పనులకు సోమవారం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రెండు కోట్ల 40 లక్షలతో నిజాంపల్లి నుంచి గాంధీనగర్ వరకు రోడ్లు నిర్మాణ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ కిష్టన్న, నాయకులు నర్సన్న, పున్నం రవి, పత్తి తిరుపతి, మొట్టి కిరణ్‌పటేల్, షైస భిక్షపతి, మేకల భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



వెంటిలేటర్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, పక్కన కలెక్టర్ రాహుల్‌శర్మ

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యసేవలు

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి కలెక్టరేట్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుతున్నట్లు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. జీజీహెచ్‌లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద ఏర్పాటుచేసిన వెంటిలేటర్లను సోమవారం కలెక్టర్ రాహుల్‌శర్మతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వెంటిలేటర్ల ఏర్పాటుతో అత్యవసర సేవలు మరింత అందుబాటులోకి వస్తాయన్నారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ప్రభుత్వ ఆస్పత్రికి రూ. 32లక్షల వెంటిలేటర్లు ఇవ్వడం అభినందనీయమన్నారు. జీజీహెచ్‌కు జిల్లా ప్రజలే కాకుండా మహారాష్ట్ర, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాల నుండి ప్రజలు వైద్యసేవలకు వస్తారన్నారు. అత్యవసర వైద్యసేవలకు ఎంఆర్‌ఐ పరికరం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, జీజీహెచ్ సూపరిటెండెంట్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మునిసిపల్ ప్రత్యేక అధికారిగా విజయలక్ష్మి

భూపాలపల్లిటౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి మునిసిపల్ ప్రత్యేక అధికారిగా అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి బాధ్యతలు స్వీకరించారు. ఈ నెల 26తో పాలకవర్గం గడువు పూర్తికావడంతో ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభమైంది.

ఈ నేపథ్యంలో అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మికి బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మునిసిపల్ కమిషనర్ రాజేశ్వర్, సిబ్బంది ఆమెను సాదరంగా ఆహ్వానించి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.







ఇంకెన్నాళ్లు..?



గణపురం మండలం కొండాపూర్‌లో స్లాబ్ లెవల్‌లో నిలిచి పోయిన సబ్ సెంటర్ నిర్మాణం

- జిల్లాలో సాగుతున్న సబ్ సెంటర్ల నిర్మాణం
- ఏళ్లు గడుస్తున్నా పూర్తి కాని నిర్మాణాలు
- 63 నిర్మాణాలకు పూర్తయింది కొన్నే..
- సబ్ సెంటర్ల నిర్మాణాలపై కలెక్టర్ ఆగ్రహం

భూపాలపల్లి కలెక్టరేట్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించాలనే లక్ష్యం నీరుగారిపోతుంది. పల్లెల్లోని ఆరోగ్య ఉపకేంద్రాలను (సబ్ సెంటర్లు) మెరుగుపర్చాలనుకున్న ప్రభుత్వ సంకల్పం సన్నగిల్లి పోతుంది. జిల్లాల్లో నిర్మిస్తున్న సబ్ సెంటర్ల(ఆరోగ్య ఉప కేంద్రాల) నిర్మాణాలు సాగుతునే ఉన్నాయి. ఏళ్లు గడుస్తున్నా సబ్ సెంటర్ల నిర్మాణాలు పూర్తి కావడం లేదు. జిల్లాలో ఉన్న మొత్తం 90 ఆరోగ్య ఉపకేంద్రాల్లో 63 కేంద్రాలను ఆధునీకరించాలనే లక్ష్యంతో చేపట్టిన నూతన భవనాల నిర్మాణాలు నత్తనడకన నడుస్తున్నాయి. నిర్మించతలపెట్టిన 63 సబ్ సెంటర్లల్లో 17 మాత్రమే పూర్తి కాగా 23 నిర్మాణాలు వివిధ దశలో ఉన్నాయి.

పాత భవనాల్లోనే..

జిల్లాలో మొత్తం 14 పీహెచ్‌సిలు, 2 సీహెచ్‌సీల పరిధిలో మొత్తం 90 సబ్ సెంటర్లు ఉన్నాయి. సబ్ సెంటర్లల్లో చాలా వరకు కిరాయి భవనాలు, పాతబడిన ప్రభుత్వ సంస్థ భవనాల్లోనే నిర్వహిస్తున్నారు. కిరాయి భవనాలు, పాత భవనాల్లో సబ్ సెంటర్ల నిర్వహణ కష్టతరం అవుతునే ఉంది. ముఖ్యంగా వానకాలంలో విధులు నిర్వర్తించేందుకు సిబ్బంది తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. వైద్యసిబ్బంది, ప్రజల ఇబ్బందులును దృష్టిలో పెట్టుకొని నూతన భవనాల నిర్మాణంకు 2021లో ప్రభుత్వం సంకల్పించింది. దీంతో కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భవనాలను మంజూరుచేయడంతో పాటు నిధులను మంజూరు చేశాయి. మొత్తం 90 సబ్ సెంటర్లల్లో 63 సబ్‌సెంటర్లకు నూతన భవనాలను నిర్మించాలని ప్రభుత్వం సంకల్పించింది. ఇందుకోసం నిధులను సైతం మంజూరు చేసింది.



గణపురం మండలం సీతారాంపురంలో ఫిల్లర్ల వరకు నిలిచిపోయిన సబ్ సెంటర్ నిర్మాణం

నత్తనడకన నిర్మాణాలు

సబ్ సెంటర్ల నిర్మాణాలు

మిగతా 8వ పేజీలో...



నాగేశ్వర్‌రావును పరామర్శించిన మంత్రి



నాగేశ్వర్‌రావు ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుంటున్న మంత్రి సీతక్క

ములుగు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం బుట్టాయిగూడెంలో జరిగిన ప్రజాపాలన గ్రామసభలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన కుమ్మరి నాగేశ్వర్‌రావును రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయసీతక్క పరామర్శించారు. హనుమకొండ జిల్లా ఆరెపల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో నాగేశ్వర్‌రావు చికిత్స పొందుతుండగా ఆదివారం రాత్రి వెళ్లిన మంత్రి సీతక్క యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులతో మాట్లాడారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని డాక్టర్లను కోరారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

▸▸ గిరిజన దర్బార్‌లో ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా



ఐటీడీఏలో పీవో చిత్రామిశ్రాకు వినతిపత్రం అందిస్తున్న గిరిజనులు

ఏటూరునాగారం రూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): గిరిజనులు తమ దృష్టికి తీసుకొస్తున్న సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించి వారికి మెరుగైన సేవలు అందించేందుకు సెక్టోరియల్ అధికారులు కృషి చేయాలని ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా అన్నారు. ఏటూరునాగారం మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం గిరిజన దర్బార్ నిర్వహించి గిరిజనుల వద్ద నుంచి పీవో వినతులు స్వీకరించారు. గిరిజన దర్బార్‌లో మొత్తం 20 మంది గిరిజనులు తమ సమస్యలను పీవోకు మొరపెట్టుకున్నారు. కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగ అవకాశం కల్పించాలని వాజేడు మండలం కోయ వీరాపురం గ్రామానికి చెందిన శ్రీమని పీవోకు వినతి పత్రం అందించారు. గిరివికాస పథకం ద్వారా పోడు భూములకు విద్యుత్తు, బోర్లు వేయించాలని తాడ్వాయి మండలం కోడిశాల గ్రామానికి చెందిన రైతులు పాపయ్య, మల్లయ్యలు పీవోకు మొరపెట్టుకున్నారు.

మంగపేట మండలం మామిడిగూడెంలో గల పాఠశాలకు ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టాలని అదేగ్రామానికి చెందిన తాటి విజయ్‌బాబు పీవోకు వినతిపత్రం అందించారు. మేడారం జాతర 2024లో ఆదివాసీ మ్యూజియంనకు రంగులు వేశామని, దానికి సంబంధించిన బిల్లులు చెల్లించాలని నవీన్ శ్రీధర్‌లు పీవోను వేడుకున్నారు. ఆర్వోఎఫ్ఆర్ పట్టాభూమి కలదని, దానికి రైతుభరోసా పథకాన్ని వర్తింపచేయాలని కన్నాయిగూడెం మండలం గంగుగూడెం గ్రామానికి చెందిన సమ్మక్క పీవోకు మొరపెట్టుకున్నారు. మంగపేట మండలంలో పట్టాభూముల్లో గిరిజనుల సొసైటీల ద్వారా జరుగుతున్న ఇసుక క్వారీలపై విచారణ చేపట్టాలని గోవిందరావుపేట మండలానికి చెందిన ముద్దబోయిన రవి పీవోకు వినతి పత్రం అందించారు. కన్నాయిగూడెం మండలకేంద్రంలో కొమురం భీం విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని తుడుందెబ్బ నాయకులు పీవోను కోరారు. కన్నాయిగూడెం మండలం ఐలాపురం త్వరలో జరగనున్న సమ్మక్క- సారలమ్మ జాతరలో విధులు నిర్వర్తించే వలంటీర్లకు టీషర్ట్‌లు అందించాలని ఐలాపురంనకు చెందిన ఎం.రవి పీవోకు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో డీడీ పోచం, ఏఈ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం ఈవోగా మహేష్ పదవీ బాధ్యతలు



ఈవోగా బాధ్యతలు చేపడుతున్న మహేష్

మహదేవపూర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో సంవత్సరంన్నర క్రితం ఈవోగా పని చేసిన మహేష్ అనుకోని కారణంగా దేవాదాయ ధర్మాదాయ అధికారులు కోటంచకు బదిలీ చేశారు. కరీంనగర్ జిల్లాలోని హనుమాన్ దేవాలయంలో పనిచేస్తున్న ఈవో మారుతిని ఇన్‌చార్జ్ ఈవోగా అధికారులు కాళేశ్వరంగా ఈవోగా నియమించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఇన్‌చార్జ్ హోదాలో మారుతి పనిచేస్తూ కుంభాభిషేకంతో పాటు సరస్వతి పుష్కరాల పనుల్లో నిమగ్నమై ఉండడంతో గర్భాలయంలో ప్రైవేటు ఆల్బమ్ చిత్రీకరించడంతో అతడిని బదిలీ చేసి మళ్లీ కాళేశ్వరం ఈవోగా మహేష్‌కు పూర్తి పదవీ బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ ఫిబ్రవరి 7, 8, 9 తేదీల్లో జరిగే మహా కుంభాభిషేకం రోజులు దగ్గర పడ్డాయని, ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేసి కుంభాభిషేకాన్ని ఘనంగా నిర్వహిస్తామని ఆయన తెలిపారు. సోమవారం పూర్తి పదవీ బాధ్యతలు చేపట్టారు.

ఈవోపై బదిలీ వేటు సరే..

▸▸ మధుప్రియపై చర్యలేవీ? ▸▸ ప్రశ్నిస్తున్న భక్తులు

మహదేవపూర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరాలయంలో ప్రైవేటు ఆల్బమ్ తీసిన మధుప్రియపై చర్యలేవి అని పలువురు చర్చించుకుంటున్నారు. కాళేశ్వరాలయ ఈవోను బదిలీ చేయడంతో పాటు ఉద్యోగులకు మెమోలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఇందుకు ప్రధాన బాధ్యురాలైన సినీ గాయని మధుప్రియకు ప్రభుత్వం ఎలాంటి నోటీసులు జారీ చేయకపోగా ఆమెపై ఎలంటి చర్యలు తీసుకోకపోవడం సరికాదని పలువురు భక్తులు విమర్శిస్తున్నారు. పవిత్రమైన కాళేశ్వరాలయంలో గుడి తలుపులు పెట్టి ఆలయంలో ఆల్బమ్ చిత్రీకరణ ఎంత పాపమో ఆమెకు తెలియాలని, ఆమెపై వెంటనే చర్యలు చేపట్టాలని పలువురు భక్తులు తెలుపుతున్నారు. మధుప్రియపై చర్యలు ఉంటేనే ఇంకోసారి ఆలయంలోకి ఎవరైనా చిత్రీకరణ కార్యక్రమాలు చేపట్టకుండా ఉంటాయని, ఇందుకు ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని భక్తులు కోరుతున్నారు.

మానుకోట సబ్‌జైలర్‌కు రాష్ట్రస్థాయి అవార్డు

• జైళ్లశాఖ డీజీ సౌమ్యమిశ్రా చేతుల మీదుగా ప్రదానం



హైదరాబాద్‌లో జైళ్ల శాఖ డీజీ సౌమ్యమిశ్రా చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న మహబూబాబాద్ సబ్‌జైల్ అధికారి శ్రీనివాసరావు

మహబూబాబాద్ రూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ సబ్‌జైల్ అధికారి శ్రీనివాసరావు రాష్ట్రస్థాయి ఉత్తమసేవా అవార్డును అందుకున్నారు. హైదరాబాద్‌లో గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం రాత్రి ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జైళ్లశాఖ డీజీ సౌమ్యమిశ్రా చేతుల మీదుగా శ్రీనివాసరావు అవార్డుతో పాటు ప్రశంసా పత్రం అందుకున్నారు. గత రెండు దశాబ్దాలుగా తన విధి నిర్వహణలో పారదర్శకంగా వ్యవహరిస్తూ నిజాయితీగల పోలీస్ అధికారిగా పేరు తెచ్చుకున్న శ్రీనివాసరావు ఖైదీల విషయంలో ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ వారి సంక్షేమం కోసం జైలు నిబంధనలను పాటిస్తూ వాటిని అమలు చేసినందుకు గాను రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపికయ్యారు. అవార్డును అందుకున్న శ్రీనివాసరావును జైలు శాఖ డిప్యూటీ జైలర్ భిక్షపతి, అధికారి విజయ్ డెన్నీ, సిటిజన్ ఫోరం సభ్యులు శంతన్‌రామరాజులు అభినందించారు.

'ఉన్నతి' పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

• జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నరేష్



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఆర్డీవో నరేష్

కాటారం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా ఉన్నతి కార్యక్రమం కింద అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నరేష్ అన్నారు. కాటారం రైతు వేదికలో సోమవారం డివిజన్ పరిధిలో గత మూడేళ్లలో 100 పని రోజులు పూర్తి చేసుకున్న 18-45ఏళ్ల వయస్సు గల ఈజీఎస్ కూలీలకు ఉన్నతి కార్యక్రమంలో భాగంగా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలతో పాడి పరిశ్రమ, సేంద్రీయ వ్యవసాయం, వర్మికంపోస్ట్ తయారీ, చేపల పెంపకం తదితర రంగాలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఆర్డీవో నరేష్ మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధరంగాలతో జీవన ప్రమాణాలు పెంచుకోవచ్చన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కింద యువతకు ఎలక్ట్రీషియన్, ప్లంబింగ్, టీవీ, సెల్‌ఫోన్ మెకానిక్, టైలరింగ్, డ్రైవింగ్ వంటి అంశాల్లో హన్మకొండలో శిక్షణా తరగతులు ఉంటాయని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఏపీడీ మంజులాదేవి, డీపీఎం వినేష్, డివిజన్ పరిధి మండలాల ఏపీవోలు వెంకన్న, రమేష్, హరీష్, కుమార్, ఏపీఎం లవకుమార్, టీపీలు, సీసీలు, ఎఫ్ఏలు, వీవోఏలు పాల్గొన్నారు.

లారీడ్రైవర్ అనుమానాస్పద మృతి

• కోడలిపై అనుమానం ఉందని ఫిర్యాదు చేసిన మృతుడి తల్లి



కందుల సురేష్ మృతదేహం

భూపాలపల్లి కృష్ణకాలనీ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి మునిసిపాలిటీ పరిధిలో ఓ లారీ డ్రైవర్ అనుమానాస్పదంగా మృతి చెందాడు. భూపాలపల్లి సీఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి మునిసిపాలిటీ పరిధిలోని ఖాశీంపల్లి శివారు బాలాజీ నగర్‌కు చెందిన కందుల సురేష్(37) అనే వ్యక్తి లారీ డ్రైవర్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి ఇంటి ముందర నిద్రించిన ఆయన సోమవారం తెల్లవారుజామున చూసే సరికి నోటి నుంచి నురుగు కారుకొని చనిపోయి ఉన్నాడు. దీంతో తల్లి కందుల సుగుణ తనకుమారుడి మరణంపై తన కోడలైన కందుల స్వప్నపై అనుమానం ఉందని ఫిర్యాదు చేసిందన్నారు. దీంతో ఆమె ఫిర్యాదు ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

కాగా, మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే, తన కుమారుడి ఒంటిపై గాయాలు ఉన్నాయని, ఎవరో ఇద్దరు వ్యక్తులు కలిసి హత్య చేసి ఉంటారని మృతుడి తల్లి సుగుణ కన్నీరు మున్నీరుగా విలపిస్తూ చెప్పింది.

శంకరంపల్లిలో రైతుల ఆందోళన

• ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యం చాలక పంటలు ఎండిపోతున్నాయని నిరసన

కాటారం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శంకరంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని 63కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పలువురు రైతులు సోమవారం ఆందోళన నిర్వహించారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు రైతులకు చెందిన 14 వ్యవసాయ బోర్ల కనెక్షన్లతో పాటు గ్రామానికి సంబంధించిన నీటిని సరఫరా చేసే బోర్ మోటార్ కనెక్షన్ ఉండటంతో కెపాసిటీ సరిపోక, విద్యుత్ సక్రమంగా అందక బోర్లు నడవడం లేదని, దీంతో పంటలు ఎండిపోయే పరిస్థితి తలెత్తిందని రైతులు ఆరోపిస్తూ నిరసన తెలిపారు. పక్కనే ఉన్న 100కేవీ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్‌పై లోడ్ తక్కువగా ఉన్నదని, దానికైనా కొన్ని బోర్ల కనెక్షన్లు కలపాలని లేదా 63కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను 100 కేవీగా అప్‌గ్రేడ్ చేయాలని అధికారులకు ఎన్నిసార్లు చెప్పిన పట్టించుకోవడం లేదని ఆరోపించారు. విద్యుత్ సక్రమంగా లేక బోర్లు నడవక మిరప తోటలు ఎండిపోతున్నాయని, కొందరు రైతులు నాట్లు వేయలేని పరిస్థితి ఉందన్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోకుంటే కుటుంబాలతో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతులు మునిస్వామి, సంతోష్, మార్క రాజయ్య, బాపు, ఓదెలు, నర్సయ్య, గౌరయ్య, స్వామి, బతుకమ్మ, సమ్మయ్య, శంకరయ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

మిర్చి తోటలో క్షుద్రపూజల కలకలం

• తోట చుట్టూ మొక్కజొన్నలు పోసి మధ్యలో కోడిని పాతిపెట్టిన వైనం

మహబూబాబాద్ రూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ మండలం కొమ్ముగూడెం గ్రామ శివారు ఓ రైతు మిర్చి తోటలో క్షుద్రపూజలు సోమవారం కలకలం సృష్టించాయి. గ్రామానికి చెందిన గిరి జన రైతు కేలోతు మల్సూర్ తనకున్న రెండు న్నర ఎకరాల్లో మిర్చి తోటను సాగు చేశాడు. ఆగస్టు మొదటి వారంలో తోట చుట్టూ ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు మొక్కజొన్నలు పోసి.. తోట మధ్యభాగంలో బొంద తీసి కోడిని పాతిపెట్టారు. రెండోసారి కార్తీకపౌర్ణమి రోజున మరోసారి అదే విధంగా చేశారు. మూడోసారి ఈనెల 26న ఆదివారం రాత్రి కూడా ఇలాగే చేశారు. మర్నాడు తోటకు నీరు పెడుతుండగా కోడిని పాతిపెట్టిన చోట కాళ్లు బయటకు కనిపిం చడంతో ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు తన తోటలో క్షుద్రపూజలు చేస్తున్నారని రైతు ఆందోళన చెందాడు. కోడిని పాతిపెట్టిన చోట మట్టిని తవ్వి చూడగా కోడి ఉంది. అదే విధంగా తోట చుట్టూ పరిశీలించగా మొక్కజొన్నలు పోసి ఉండడాన్ని గమనించారు. దీంతో ఆ రైతు భయాందోళనకు గురవుతున్నాడు.

నేడు మానుకోటలో జిల్లా స్థాయి క్విజ్ పోటీలు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో మంగళవారం రోడ్డు భద్రత వారోత్సవాలను పురస్కరించుకొని జిల్లాస్థాయి క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఈ పోటీల్లో 8 నుంచి 10వ తరగతి విద్యార్థులను స్కూల్‌కు ఒకరి చొప్పున పంపించాలని హెచ్‌ఎంలకు సూచించారు. ఇతర వివరాలకు జిల్లా సైన్స్ అధికారి అప్పారావు సెల్ నెంబర్ : 98495 58281ను సంప్రదించాలన్నారు.



WANTED

★ హనుమకొండ లష్కర్ బజార్ పబ్లిక్ గార్డెన్ దగ్గర ఉన్న HP పెట్రోల్ పంపు నందు పెట్రోల్, డీజిల్ క్యాషియర్ మరియు ఫిల్లర్స్ గా ఫిల్లింగ్ చేయుటకు యువతి యువకులు కావలెను (8గం॥, 12గం॥, 24గం॥). సం॥ప్ర॥ 9505919293.
AJW-226374

WANTED

★ హనుమకొండలో మా సంస్థ యందు పని చేయుటకు 3 వీలర్ బ్యాచ్ డ్రైవర్ మరియు సప్లై బాయ్ కావలెను.మంచి వేతనం ఇవ్వబడును. Contact.: 9666717040
AJM-13046

WANTED

★ కేంద్ర ప్రభుత్వం సంస్థ LIC యొక్క SBA Office లో పని చేయుటకు Office Assistant (Female Above 21 yrs) & Agency Manager (అర్హత డిగ్రీ ఆపైన, M/F) కావలెను. సం॥ప్ర॥ 9440120885, 8341666341.
AJW-14297

WALK - IN - INTERVIEW

★ హన్మకొండలోని బాలసముద్రం రోడ్‌లో గల హోటల్ థౌజండ్ పిల్లర్స్‌లో పని చేయుటకు హోటల్ స్టాఫ్ కావలెను. పూర్తి బయోడేటాతో జనవరి 29, 30 తేదీలలో ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఇంటర్వ్యూకి హాజరు కాగలరు. సం॥ప్ర॥ 9182056622.
AJW-27781

PLOT FOR SALE

★ వరంగల్, ములుగు రోడ్డు ఇండస్ట్రియల్ ఎస్టేట్ యందు 110 చ॥గ॥ ప్రహరీ గోడ, గేటు గల ప్లాటు అమ్మబడును. సం॥ప్ర॥ 9848423809.
AJW-226031

HOUSE FOR SALE

★ ఖిలా వరంగల్ మండలం గుంటూరుపల్లి గ్రామం (Near బొల్లికుంట రోడ్) తూర్పు ముఖంతో గల కొత్త ఇల్లు 250 గజాల స్థలంలో 1600 Sq.yrd G+1 3 BHK పక్కా రిజిస్ట్రేషన్ గలది అమ్మబడును. సం॥ప్ర॥ 9347499270, 7416690305.
AJW-226421

TOLET

★ వరంగల్, ములుగు రోడ్డు ఇండస్ట్రియల్ ఎస్టేట్ యందు 2 షట్టర్లు, 250 Sft గలవి వర్క్ షాపులకు, గోడాంలకు, షాపులకు కిరాయికి ఇవ్వబడును. సం॥ప్ర॥ 9848423809.
AJW-226035

LEASE / SALE

★ జులైవాడలో 140 చ॥గ॥లో ఉన్న కొత్త 2 అంతస్తుల బిల్డింగ్ లీజ్ పై (8-10 లక్షలు) మాకు అర్జెంటుగా సమకూర్చిన చో ఆ ఇంటికి కిరాయి లేకుండా 3 సం॥ వరకు ఉండవచ్చును లేదా బిల్డింగ్ మొత్తం అమ్మబడును. సం॥ప్ర॥ 9491625792.
AJW-3385

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ప్రతి నాలుగు లైన్ల క్లాసిఫైడ్ ప్రకటనకు రూ. 250/- మాత్రమే. అదనపు లైనుకు రూ. 45/-

గమనిక : మీరు ఇచ్చే ప్రతీ ప్రకటనలకు 5% GST అదనంగా చెల్లించవలెను.

ప్రకటనల కొరకు సంప్రదించండి

హన్మకొండ
9985400013
8978510273
వరంగల్
9985406150
9985408173
జనగామ
9866431354
మహబూబాబాద్
9985418040
తొర్రూర్
9985418040
నర్సంపేట
9985418040
భూపాలపల్లి
9985401232
పరకాల
9985401232

3+2 స్కీం కలదు

లక్ష డప్పులు కాదు.. లక్ష పుస్తకాలు ఇవ్వండి

• జేఎంఎం రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్

మహబూబాబాద్ టౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరిలో ఎస్సీ వర్గీకరణ కోరుతూ మంద కృష్ణమాదిగ చేపట్టిన లక్ష డప్పుల కార్యక్రమం ఎందుకని, ఆయనకు చిత్తశుద్ధి ఉంటే లక్ష డప్పులు కాదు... లక్ష పుస్తకాలు అందించాలని జాతీయ మాల మహానాడు (జేఎంఎం) రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ అన్నారు. మంద కృష్ణ మాదిగ తమ జాతిని డప్పులు, చెప్పులకే పరిమితం చేస్తున్నారే తప్ప విద్యవైపు ఎందుకు తీసుకువెళ్లడంలేదని ప్రశ్నించారు. మహబూబాబాద్ పట్టణంలోని పెరుమాళ్లజగన్నాధం భవన్‌లో జేఎంఎం జిల్లా కమిటీ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ.....అశాస్త్రీయమైన, రాజ్యాంగం విరుద్ధ ఎస్సీ వర్గీకరణపై మేధావులు అనుకునే వారు తమకు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారే తప్ప శాస్త్రీయంగా మాట్లాడడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మాదిగలపై ప్రేమ చూపిస్తున్న ప్రధాని మోదీ తొలుత బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో వర్గీకరణ చేయాలన్నారు. మనువాదుల కుట్రలను తిప్పి కొట్టేందుకు మాలమహానాడు కార్యకర్తలు సైన్యంలా పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా 1200 కిలో మీటర్ల మేర పాదయాత్ర చేసిన రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో జాతీయ కార్యదర్శి అశోదభాస్కర్, దార కుమార్, బెజ్జం ఐలేష్, జయపాల్, భరత్, ప్రేమ్‌కుమార్, మహేష్, ఐలయ్య, జానీ, తిరుపతి, ఉపేందర్, సాత్విక్, ప్రశాంత్, అశోక్, చందా శ్రీనివాస్, రాకేష్, యాకాంతం పాల్గొన్నారు.


రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

మహదేవపూర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మహదేవపూర్ మండలంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మహదేవపూర్ తహసీల్దార్ కార్యాలయంలో ధరణి ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం.వెంకటేశ్ తన తోటి ఆపరేటర్లతో కలిసి ధణి ఆపరేటర్ల ఉద్యోగ భద్రత, కొన్ని నెలలుగా వేతనం రాకపోవడం విషయమై హైదరాబాద్ తరలుతున్నారు. ఈ క్రమంలో తాను ప్రయణిస్తున్న కారు రోడ్డు ప్రమాదానికి గురై తలకు తీవ్ర గాయాలపాలయ్యాడు. ప్రస్తుతం అతడు హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలి

▸▸ బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి దార్ల శివరాజ్

మహబూబాబాద్ టౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ మునిసిపల్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి దార్ల శివరాజ్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మానుకోటలో సోమవారం వరంగల్ రీజినల్ డైరెక్టర్ ఆఫ్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్(ఆర్డీఎంఏ) సయ్యద్ మసూద్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా శివరాజ్ మాట్లాడుతూ... ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, నాలాలో నిర్మిస్తున్న నిర్మాణాలకు అనుమతులు ఇస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రీన్‌ల్యాండ్‌ల చుట్టూ ఫెన్సింగ్ చేసి బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. లేనిపక్షంలో బీఎస్పీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఈసంపెల్లి ఉపేందర్, కార్యదర్శి గుగులోతు నరేష్‌నాయక్, జి.నరేష్ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా తొలుత మునిసిపల్ భవన నిర్మాణం, మునిసి పల్ స్థలాలను సందర్శించారు.



ఆర్డీఎంఏ మసూద్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న బీఎస్పీ నేతలు

ఇనుగుర్తి ఎంపీడీవో కార్యాలయ ఏర్పాటునకు సన్నాహాలు

▸▸ ప్రతిపాదనలు పంపాలని అధికారుల ఆదేశాలు

కేసముద్రం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): నూతనంగా ఏర్పాటైన ఇనుగుర్తికి మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ మేరకు భవనం, సిబ్బంది, ఇతర వసతుల కేటాయింపుపై ప్రతిపాదనలు పంపాలని సోమవారం ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందాయి. ఇనుగుర్తిలోని ఎస్సీ హాస్టల్ భవనాన్ని తాత్కాలికంగా మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఏర్పాటు చేసేందుకు పరిశీలించినట్లు కేసముద్రం ఎంపీడీవో క్రాంతి తెలిపారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	-	-
పల్లికాయ (సూక)	5150	4600
పల్లికాయ (పచ్చిది)	6200	3100
కందులు	6512	4460
పెసళ్లు	7073	2800
పత్తి	7020	5800
పసుపు (కాడి)	-	-
పసుపు (గోల)	-	-
తేజ మిర్చి	14000	9000
తేజ మిర్చి (కొత్తది)	-	-
తేజ ఏసీ	-	-
వండర్‌హాట్	14500	11500
యూఎస్341ఏసీ	-	-
యూఎస్341	15000	11500
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

బీటెక్ చదివి... ఆన్‌లైన్ గేమ్‌లకు అలవాటుపడి..

▸▸ డబ్బు కోసం చోరీకి యత్నించిన ఖమ్మం జిల్లా యువకుడు

▸▸ బంగారు గొలుసుతో పరారీ..

▸▸ పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన స్థానికులు

▸▸ మహబూబాబాద్ జిల్లా కేసముద్రంలో ఘటన



కేసముద్రంలో దొంగతనానికి యత్నించిన వ్యక్తికి దేహశుద్ధి చేస్తున్న గ్రామస్థులు

కేసముద్రం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : ఆ యువకుడు బీటెక్ చదివాడు. ఆన్‌లైన్ గ్రేమ్స్‌కు అలవాటు పడ్డాడు. చివరకు ఆ గేమ్స్‌లో డబ్బు పెట్టేందుకు దొంగగా మారాడు. చివరకు గొలుసు కొంటాననంటూ ఓ బంగారం దుకాణానికి వెళ్లి.. చోరీకి యత్నించి దొరికిపోయాడు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం స్టేషన్‌లో సోమవారం పట్టపగలే జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలివీ. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం కిష్టాపురం గ్రామానికి చెందిన పిట్టల సాయి బీటెక్ చదివి, ఆన్‌లైన్ గేమ్‌లకు అలవాటుపడ్డాడు. ఈ గేమ్స్‌లో పెట్టేందుకు డబ్బులు లేకపోవడంతో దొంగతనం చేయాలని నిర్ణయించుకున్నాడు. ఈక్రమంలో స్థానిక ఉప్పరపల్లిరోడ్‌లోని గాయత్రి జువెల్లర్స్‌కు వచ్చి తనకు ఓ బంగారు గొలుసు కావాలని అడగడంతో షాపు యజమాని బోగోజు వేణుగోపాలాచారి సుమారు రూ.1.20 లక్షల విలువైన తులంన్నర గొలుసును చూపించాడు. దానిని ట్రయల్‌గా వేసుకున్నట్టు వేసుకున్న సాయి వెంటనే పరుగు అందుకున్నాడు. దాంతో వేణుగోపాలాచారి కేకలు వేయడంతో ఇరుగుపొరుగు వారంతా వెంబడించారు. ఈక్రమంలో బొడ్రాయి సమీపంలోని ఒక వీధిలో కనిపించిన యువకుడిని పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. బాధితుడు వేణుగోపాలాచారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని ఎస్ఐ మురళీధర్‌రాజ్ వివరించారు.

మీ టికెట్ యాప్‌లో వరంగల్ టూరిజం

ఉమ్మడి జిల్లాలోని పర్యాటక ప్రాంతాలకు చోటు






పర్యాటకం

- త్వరలోనే యాప్‌లో అందుబాటులోకి..
- వివరాలను పంపిన జిల్లా పర్యాటక శాఖ
- ఇప్పటికే కొన్ని ప్రదేశాల చేర్పు

హనుమకొండ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను సందర్శించాలనుకునే వారికి ఇకపై మొబైల్ ద్వారానే సమాచారమంతా అందనుంది. కోరుకున్న పర్యాటక ప్రాంతానికి వెళ్లడానికి మీ టికెట్ యాప్ అందుబాటులోకి వచ్చింది. ఆర్టీసీ హైదరాబాద్ మెట్రో టికెట్లు సహా తెలంగాణలోని ప్రముఖ దేవాలయాల్లో దర్శనం, ఇతర సేవలకు సంబంధించిన టికెట్లన్నీ సులభంగా ఈ యాప్ ద్వారా పొందొచ్చు. ఇందు కోసమే రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఈ మీ టికెట్ మొబైల్ అప్లికేషన్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇటీవలే రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఈ యాప్‌ను ప్రారంభించారు. అయితే ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న అనేక పర్యాటక ప్రదేశాలు, ప్రముఖ దేవాలయాల సమాచారాన్ని మీ టికెట్ యాప్‌లో జోడించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఉమ్మడి జిల్లాలోని ప్రఖ్యాత పర్యాటక ప్రాంతాల గురించిన సమాచారాన్ని ప్రభుత్వం ఇప్పటికే తెప్పించుకుంది. మీ టికెట్ యాప్‌లో పొందుపరచాల్సిన దర్శనీయ స్థలాలకు సంబంధించిన ప్రతిపాదనలను జిల్లా పర్యాటక శాఖ పంపించింది. ఇప్పటికే కొన్ని ప్రదేశాలను ఈ యాప్‌లో చేర్చారు. త్వరలో మిగతావాటిని పొందుపరిచేందుకు కసరత్తు జరుగుతోంది. యాప్‌లో ఉమ్మడి జిల్లా పర్యాటక ప్రాంతాలను చేర్చేందుకు అవసరమైన సాంకేతిక సహకారాన్ని జిల్లాలోని నేషనల్ ఇన్‌ఫర్మేషన్ సెంటర్ (ఎన్ఐసీ) అందిస్తోంది.

యాప్ డౌన్‌లోడ్ ఇలా..

మీ టికెట్ యాప్‌ను ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని మొబైల్ నెంబర్, పాస్‌వర్డ్‌ను నమోదు చేసి లాగిన్ కావాల్సి ఉంటుంది. మీ టికెట్ యాప్‌లో ఇప్పటికే రాష్ట్రంలోని 15 ప్రముఖ దేవాలయాలు, 129 పార్కులు, 51 బోటింగ్ ప్రదేశాలు, జంతు ప్రదర్శన శాలలు, మెట్రో, ప్లే అండ్ ఎంటర్‌టైన్‌మెంట్‌జోన్స్, కమ్యూనిటీ హాల్స్ తదితర వాటి కోసం టికెట్లు బుక్ చేసుకునే అవకాశం కల్పించారు. ఎలాంటి అదనపు చార్జీలు లేకుండా యూపీఐ ద్వారా చెల్లింపు చేయొచ్చు. ఇదే కాకుండా వినియోగదారులు ఎంచుకున్న లోకేషన్‌కు సమీపంలోని చూడదగ్గ ప్రదేశాలుంటే ఆ సమాచారం కూడా యాప్‌లో కనిపించేలా మీ టికెట్ యాప్‌ను రూపొందించారు. హైదరాబాద్ నగరానికి నిత్యం వేల సంఖ్యలో ప్రజలు, వ్యాపారం, వైద్యం, ఇతర అవసరాల కోసం ప్రయాణం సాగిస్తుంటారు. ఇలాంటి వారు నగరంలోని ఇతరత్రా ప్రాంతాలకు వెళ్లాలంటే తక్కువ ధర, తక్కువ సమయంలో వెళ్లేందుకు మెట్రోను ఎంచుకుంటారు. సంబంధిత స్టేషన్‌కు వెళ్లి టికెట్ బుక్ చేసుకోవడానికి ఆపసోపాలు పడాల్సిన పని లేకుండా మీ టికెట్ యాప్‌లో టికెట్ సులభంగా బుక్ చేసుకోవచ్చు.

ఉమ్మడి జిల్లాలోని దర్శనీయ స్థలాలను చేర్చుతున్నాం

ఇతర రాష్ట్రాలు, జిల్లాలవారు, స్థానికులు ఉమ్మడి జిల్లాలోని పర్యాటక ప్రాంతాలకు వెళ్లేందుకు ఇంటి వద్దే తమ మొబైల్ ద్వారా టికెట్లు బుక్ చేసుకోవడానికి అక్కడ ఒకటీ రెండు రోజులు బస చేయడానికి వీలుగా అవసరమైన వసతి కల్పనకూ ముందస్తు బుకింగ్ చేసుకోవడానికి మీ టికెట్ యాప్ ఎంతో ఉపయోగపడుతుంది. ఉమ్మడి జిల్లాలోని చూడదగ్గ ముఖ్యమైన అన్ని దర్శనీయ స్థలాలను ఎంపిక చేసి వాటిని యాప్‌లో జోడించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. కొద్ది రోజుల్లో ఇది అందుబాటులోకి వస్తుంది. ఉమ్మడి జిల్లాలోని పర్యాటక ప్రదేశాలను యాప్‌లో చేర్చడానికి ఎన్ఐసీ సాంకేతిక సహకారం అందిస్తోంది.

- శివాజీ, జిల్లా పర్యాటక శాఖ అధికారి

పర్యాటక ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ



హైదరాబాద్ నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లాకు బస్సులు

- ఆన్‌లైన్‌లో దరఖాస్తులు
- ఏర్పాట్లు చేసిన టూరిజం శాఖ అధికారులు

వరంగల్ కల్చరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో నివసించేవారు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను సందర్శించే విధంగా పర్యాటకశాఖ ఏర్పాట్లు చేసింది. ఇందుకోసం ప్రత్యేక బస్సులను కేటాయించింది. రాష్ట్ర దేవాదాయ శాఖ, పర్యాటక శాఖ అధికారులు సమన్వయంతో ఈ ఏర్పాట్లు చేసినట్లు దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ కె. నాగసంధ్యారాణి తెలిపారు. గ్రేటర్ వరంగల్ నగరంలోని భద్రకాళి దేవస్థానం, పద్మాక్షి అమ్మవారి దేవాలయం, వేయిస్తంభాల గుడి, ములుగు జిల్లాలోని రామప్ప దేవాలయాలను సందర్శించుకునే విధంగా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం టూరిజం వెబ్‌సైట్‌లో టికెట్లు బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. అదే సమయంలో ఒక డేట్ ఇస్తారు. ఆరోజు హైదరాబాద్‌లో ఉదయం 6 గంటలకు బస్సు బయల్దేరి ఈ ఆలయాల సందర్శన అనంతరం తిరిగి హైదరాబాద్‌కు రాత్రి 8 గంటలకు చేరుకుంటుంది. టికెట్ రేట్లు పెద్దలకు రూ.2197, చిన్నారులకు రూ.1758గా నిర్ణయించారు. మరో ప్యాకేజీ కింద రెండు రోజుల పాటు హైదరాబాద్, ఖమ్మం, వరంగల్ ప్రాంతాలు సందర్శించుకునే విధంగా ఏర్పాట్లు చేశారు. మొదటి రోజు ఖమ్మం జిల్లా పాల్వంచలోని పెద్దమ్మ దేవాలయం, భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయం, పర్ణశాల ఆశ్రమం సందర్శన రాత్రి అక్కడే బస ఉంటుంది. మర్నాడు ఉదయం బయల్దేరి కురివి వీరభద్రస్వామి దేవాలయం, మేడారం సమ్మక్క- సారలమ్మ దేవాలయం, మల్లూరు లక్ష్మీనర్సింహస్వామి దేవాలయం, వరంగల్ భద్రకాళి అమ్మవారి దేవాలయం, శ్రీపద్మాక్షి అమ్మవారి దేవాలయం, శ్రీరుద్రేశ్వర వేయిస్తంభాల దేవాలయం, రామప్ప శ్రీరామలింగేశ్వర దేవాలయం దర్శనం అనంతరం హైదరాబాద్‌కు చేరుకుంటారు. ఈ రెండు రోజులకు పెద్దలకు రూ.6173, చిన్నారులకు రూ.4938 చార్జీ నిర్ణయించారు. వివరాలకు టూరిజం శాఖ వారిని సంప్రదించాలని డిప్యూటీ కమిషనర్ తెలిపారు.

ఆన్‌లైన్ ద్వారా నమోదు..

ఉమ్మడి జిల్లాలో టూరిజం శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే దేవాలయాల సందర్శనలో భాగంగా పర్యాటకులు తమ పేర్లను ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకున్న అనంతరం వారికి ప్రయాణించే తేదీ, బస్సు బయల్దేరే సమయం, పలు సూచనలతో కూడిన సమాచారాన్ని మొబైల్ ఫోన్ ద్వారా తెలియజేస్తారు.

స్పౌజ్ బదిలీల్లో గందరగోళం



- తప్పులతడకగా 2002 అన్ ట్రెయిన్డ్ డీఎస్సీ ఉపాధ్యాయుల ర్యాంకులు, అపాయిమెంట్ డేట్లు
- వివరాలు లేకుండానే జాబితాలు
- పోస్టులున్నా చూపడం లేదంటూ ఆవేదన
- అధికారుల తప్పిదం.. టీచర్లకు సంకటం..

వరంగల్ ఎడ్యుకేషన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసిన స్పౌజ్ బదిలీల్లో అధికారుల తప్పిదం ఉపాధ్యాయులకు సంకటంగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్పౌజ్ బదిలీల ప్రక్రియలో అధికారులు వ్యవహరిస్తున్న తీరు ఉపాధ్యాయులను గందరగోళంగా తయారైందని ఉపాధ్యాయ సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారుల సూచనలు, స్పౌజ్ బదిలీల ఉత్తర్వుల మేరకు స్పౌజ్ బదిలీల ప్రక్రియను పూర్తి చేయాల్సిన విద్యాశాఖాధికారులు వారి వారి ఇష్టానుసారం చేయడం వల్ల మూడేళ్లుగా ఎదురుచూస్తున్న స్పౌజ్ ఉపాధ్యాయులు ఆందోళనకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పూర్తి వివరాలు వెల్లడించకుండానే స్పౌజ్ జాబితాలు ప్రకటించడం పట్ల అసహనం వ్యక్తం చేస్తున్నారు. వరంగల్, హనుమకొండ జిల్లాల్లో ఖాళీలున్నా ఖాళీలు లేవంటూ కొంత మందికి స్పౌజ్ బదిలీలను దక్కకుండా అధికారులు అడ్డుపడుతున్నారని వారు ఆరోపిస్తున్నారు. మొత్తంగా మూడేళ్లుగా ఎదురుచూస్తున్న స్పౌజ్ బదిలీలల్లో కొంత మందికి నిరాశే మిగలనుంది.

స్పౌజ్‌ల వివరాలు వెల్లడించకుండానే..

హనుమకొండ జిల్లాలో స్పౌజ్‌ల పూర్తి వివరాలు వెల్లడించకుండానే జాబితాలను సిద్ధం చేసి వాటి ప్రకారమే స్పౌజ్‌ల బదిలీల ప్రక్రియను చేపట్టేందుకు అధికారులు సిద్ధమైనట్లు ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. వరంగల్ జిల్లాలో స్పౌజ్‌లకు సంబంధించిన పూర్తి వివరాలతో జాబితాలను రూపొందించినప్పటికీ హనుమకొండ జిల్లాలో మాత్రం అలా రూపొందించకుండా కేవలం స్పౌజ్‌లలో ఒక్కరి వివరాలు మాత్రమే పొందుపరిచి జాబితాలను రూపొందించినట్లు బాధిత ఉపాధ్యాయులు చెబుతున్నారు. పూర్తిస్థాయిలో వివరాలు లేకపోవడంతో అక్రమాలు జరిగేందుకు అవకాశం ఉందని వారు చెబుతున్నారు. అధికారులు రూపొందించిన జాబితాలో ఒక ఉపాధ్యాయురాలు హనుమకొండకు స్పౌజ్ బదిలీపై వస్తుండగా ఆమె భర్త డాక్టర్ మాత్రం ఆదిలాబాద్‌లో ఉన్నారు. భర్త ఆదిలాబాద్‌లో ఉంటే ఆ ఉపాధ్యాయురాలును హనుమకొండకు స్పౌజ్‌పై ఎలా బదిలీచేస్తారని ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు.

తప్పులుగా వివరాలు

హనుమకొండ జిల్లాలో రూపొందించిన స్పౌజ్ బదిలీల్లో 2002 అన్‌ట్రైన్డ్ డీఎస్సీకి చెందిన ఉపాధ్యాయుల వివరాలు తప్పుగా నమోదైనట్లు సదరు ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు రూపొందించిన జాబితాల్లో వారి అపాయిమెంట్ల తేదీలతో పాటు డీఎస్సీ ర్యాంకులను తప్పులుగా చూపించినట్లు వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆన్‌లైన్‌లో, సర్వీస్ బుక్కుల్లో సరిగ్గానే ఉన్నా జాబితాల్లో మాత్రం తప్పులుగా రావడం పట్ల వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

అయోమయంలో ఉపాధ్యాయులు

మూడేళ్ల కిందట స్పౌజ్ బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులు గతేడాది నిర్వహించిన ఉపాధ్యాయుల పదోన్నతుల్లో కొందరు పదోన్నతులు పొందారు. ఇప్పుడు పాత కేటగిరిలో స్పౌజ్ బదిలీల చేస్తుండగా వారి కేటగిరీ మారిపోవడంతో వారి బదిలీల్లో చిక్కుముడి పడినట్లయ్యింది. వారిని బదిలీ చేయాలో లేదో తెలియని సంకటస్థితిలో అధికారులు కొట్టుమిట్టాడుతున్నారు. ఉన్నతాధికారుల నుంచి స్పష్టమైన ఉత్తర్వులు ఏమీ లేకపోవడంతో ఏం చేయాలో తెలియక అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు.

పోస్టులున్నా... బదిలీలు లేవు..

వరంగల్, హనుమకొండ జిల్లాలో పోస్టులున్నా, లేవంటూ అధికారులు కొందరికి పోస్టింగ్‌లు ఇచ్చేందుకు నిరాకరిస్తున్నట్టు బాధిత ఉపాధ్యాయులు చెబుతున్నారు. హనుమకొండ జిల్లాలో ఉర్దూ మీడియంలో రెండు గణితం పోస్టులున్నా లేవంటూ అధికారులు తప్పుడు సమాచారమిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే బయోసైన్స్‌లోనూ ఇద్దరికి పోస్టులు లేవంటూ ఎగనామం పెడుతున్నారని, ఇక వరంగల్ జిల్లాలోనూ రెండు ఉర్దూ పోస్టులున్నా లేవంటూ అధికారులు మూడేళ్ల ఆశలను నీరుగారుస్తున్నారని విచారం వ్యక్తం చేస్తున్నారు.



స్పౌజ్ బదిలీలు ఇలా..

స్పౌజ్ బదిలీల ప్రక్రియలో భాగంగా వరంగల్ జిల్లాకు మొత్తం 72 మందిని కేటాయించగా 72 మంది రిపోర్టు చేశారు. అందులో నలుగురు ఉపాధ్యాయులు అర్హత లేదని అధికారులు గుర్తించగా రెండు పోస్టులు ఖాళీలు లేవని జాబితాలు సిద్ధం చేశారు. కాగా, ప్రస్తుతం 66 మందికి రెండుమూడు రోజుల్లో జిల్లాలో పోస్టులు కేటాయించనున్నారు. ఇక హనుమకొండ జిల్లాకు 134మంది ఉపాధ్యాయులను కేటాయించారు. ఇందులో ముగ్గురు ఉపాధ్యాయులు రిపోర్టు చేయలేదు. ముగ్గురు ఉపాధ్యాయుల కేటగిరీలు తప్పుగా వచ్చాయి. మరో ఇద్దరు ఉపాధ్యాయులు స్పౌజ్‌లు హనుమకొండలో పనిచేయడం లేదు. ఒక్కరి స్పౌజ్ మృతి చెందారు. ఒక 5 పోస్టులు ఖాళీలు లేవని, సోమవారం నాడు మిగిలిన 120 మంది ఉపాధ్యాయులకు స్పౌజ్ కేటగిరీలో పోస్టులు కేటాయించనున్నారు.

త్రిశంకు స్వర్గంలో స్పౌజ్ బదిలీలు

స్పౌజ్ బదిలీల విషయంలో త్రిశంకుస్వర్గంలో ఉన్నామని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ప్రస్తుతం తాము పనిచేస్తున్న జిల్లా నుంచి అక్కడి డీఈవోలో తమను రిలీవ్ చేశారని, రెండు రోజులైనా పోస్టులు కేటాయించకపోవడంతో తాము ఎక్కడ పనిచేస్తున్నామో తెలియని పరిస్థితిలో ఉన్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రిలీవ్ అయిన తెల్లవారే వారు పోస్టులు కేటాయించాల్సిందిగా ఉన్నతాధికారుల ఆదేశాలున్నా జిల్లా విద్యాశాఖాధికారులు అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పోస్టులు కేటాయించే వరకు రెండు మూడు రోజుల సీనియారిటీ కోల్పోవాల్సి వస్తుందేమోనని వారు ఆందోళన చెందుతున్నారు.

వైవిధ్య సాహిత్య ప్రక్రియల్లో మెరుగు

- రచనల్లోనే కాదు సామాజిక సేవల్లోనూ మేటిగా అనురాధ
- సినారే రాష్ట్రస్థాయి పురస్కారానికి ఎంపిక



గవర్నర్ తమిళి సై ప్రసంసలు అందుకుంటున్న అనురాధ (ఫైల్)



ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డు అందుకుంటూ..

స్ఫూర్తి

హనుమకొండ కల్చరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): 'మోదుగు పూవు మెరుపుల తో విచ్చుకున్న తెలంగాణ.. తంగేడుల పచ్చదనం పూసుకున్న తెలంగాణ.. బోనమెత్తి బావితరపు కాంక్షలన్ని నెరవేర్చేను సాంప్రదాయ సంస్కృతులను కూర్చుకున్న తెలంగాణ' అంటూ తెలంగాణపై తన ఆర్తిని ప్రకటిస్తూ అనేక కవితా వస్తువులతో వైవిధ్య సాహిత్య ప్రక్రియలను సునాయసంగా సృజిస్తున్నారు కవయిత్రి మెరుగు అనురాధ. వృత్తిరీత్యా ఉపాధ్యాయురాలిగా పని చేస్తూ కవయిత్రిగా, రచయితగా రాణిస్తున్న ఆమె తాజాగా రాష్ట్రస్థాయిలో సినారే వాగ్భూషణ పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ నెలాఖరున కరీంనగర్‌లో జరిగే కార్యక్రమంలో ఆమె ఈ ప్రతిష్టాత్మక అవార్డును అందుకోనున్నారు. తెలంగాణ కళావేదిక కరీంనగర్ ఆధ్వర్యంలో ఏటా ప్రదానం చేసే ప్రతిష్టాత్మక రాష్ట్రస్థాయి సినారే వాగ్భూషణ పురస్కారానికి ఈసారి అనురాధను ఎంపిక చేసినట్లు పురస్కార కమిటీ ఛైర్మన్ దాస్యం సేనాపతి ప్రకటించారు. హనుమకొండ రెడ్డికాలనీలో నివాసం ఉంటున్న అనురాధ వృత్తిరీత్యా హిందీ భాషోపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు. ఆమె సాహిత్య రచన వ్యాసాంగం, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం, విద్యా ఆధ్యాత్మిక సాహిత్య వ్యాప్తికి కృషి చేస్తూ మాతృభాష తెలుగుతో పాటు జాతీయ భాష హిందీ ని పరిరక్షించేందుకు ఉద్యమిస్తున్నారు. వీణాప్రి యా కృ తి కలం పేరుతో ఆమె ఇటీవల అనురాగ వీచికలు అనే సాహిత్య సంకలనాన్ని విడుదల చేశారు. అనేక సాహిత్య పుస్తకాల్లో ఆమె కవితలు ప్రచురితమయ్యాయి. కథలు, వ్యాసాలు, హైకులు, గజల్స్, నానిలు లాంటివి అనేకం ఆమె కలంనుంచి జాలువారాయి. ఈ క్రమంలో ఆమె బాల్‌గీత్ పురస్కారాన్ని అందుకున్నారు. గతంలో సరోజినినాయుడు ఎక్సలెన్సీ పురస్కారం, విజ్ఞాన జ్యోతి పురస్కారం, సాహితీ బృందావన జాతీయ వేదిక పురస్కారం, ఎస్‌బీవీవీ ఉగాది పురస్కారం, పర్యావరణ మిత్ర అవార్డు, వే ఫౌండేషన్ ద్వారా గురుబ్రహ్మ పురస్కారం, దీపారాధన పురస్కారం లాంటివి కూడా అందుకున్నాయి. త్వరలో కరీంనగర్‌లోని ఉదయ సాహితీ ఆధ్వర్యంలో సినారే పురస్కారాన్ని అందుకోబోతున్నారు. ఈ సందర్భంగా ఆమె 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ సినారె పురస్కారం రావడం తనకు ఎంతో ఆనందంగా ఉందని, దీని ద్వారా తన బాధ్యత మరింత పెరిగినట్లయిందన్నారు. ఇక అనురాధ నృత్య రవళి కళాక్షేత్రం ద్వారా అనేక నృత్య ప్రదర్శనలకు వ్యాఖ్యాతగా కూడా వ్యవహరిస్తూ ప్రశంసలందుకుంటున్నారు.

నైపుణ్యాభివృద్ధితోనే సమర్థ పాలన

- బోధనేతర సిబ్బంది నైపుణ్యాలను పెంచుకోవాలి
- కలెక్టర్ ప్రావీణ్య



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి):నైపుణ్యాభివృద్ధితోనే ఉద్యోగులు ప్రజలకు సమర్థవంతమైన పాలనను అందించగలుగుతారని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. సోమవారం నిట్ క్యాంపస్‌లోని సెమినార్ హాల్ కాంప్లెక్సులోని బోస్ హాల్‌లో ఏర్పాటు చేసిన 'సాధికారిక నైపుణ్యత- బోధనేతర సిబ్బందికి సమగ్ర శిక్షణ' అనే అంశంపై 5 రోజుల శిక్షణా కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. వరంగల్‌లోని మాలవ్య మిషన్ టీచర్ ట్రైనింగ్ సెంటర్ (ఎంఎంటీటీసీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. కార్యక్రమం ఈనెల 31 వరకు సాగుతుంది. ముఖ్య అతిధిగా హాజరైన ప్రావీణ్య మాట్లాడుతూ ఏ సంస్థ అభివృద్ధిలో అయిన పరిపాలన కీలక పాత్రపోషిస్తుందన్నారు. ఉద్యోగులు సానుకూల దృక్పథంతో ఉండి, పరస్పరం చర్చించుకొని ఉత్తమమైన విధానాలను అర్థం చేసుకుంటూ విధులు నిర్వహించినట్లయితే అద్భుతమైన ఫలితాలు వస్తాయని అన్నారు. అవి వారు పని చేసే సంస్థ అభివృద్ధికి ఎంతో ఉపయోగపడతాయన్నారు. నిట్‌లోని బోధనేతర సిబ్బందికి శిక్షణ ఇవ్వడానికి నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం నిట్ అభివృద్ధి, పరిపాలనకు ఎంతో దోహదపడగలదన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ప్రతీ ఉద్యోగి సంస్థ సంక్షేమ, అభివృద్ధి కోసం పని చేయాలని ఉద్బోదించారు. వరంగల్ నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి మాట్లాడుతూ విద్యా సంస్థల్లో బలమైన పరిపాలనా వ్యవస్థను ఏర్పాటు చేయడంలో ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు ముఖ్య భూమిక పోషిస్తాయన్నారు. ఎంఎంటీటీసీ-యూజీసీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ప్రొఫెసర్ టి కిశోర్ కుమార్ బోధనేతర సిబ్బంది సామర్థ్యాలను మెరుగుపరచడంలో ఈ శిక్షణ కార్యక్రమం ప్రాముఖ్యతను వివరించారు.

बैंक ऑफ़ इंडिया BOI ★ బ్యాంక్ ఆఫ్ ఇండియా

అస్సెట్ రికవరీ బ్రాంచ్
10-1-1199/2, PTI బిల్డింగ్, 3వ అంతస్తు, A.C. గార్డ్స్, హైదరాబాద్-500004, ఫోన్: 7981022210, 9505544515, ఇ-మెయిల్ : AssetrecoveryBranch.Telangana@bankofindia.co.in

SARFAESI చట్టం, 2002 మరియు అందులో రూపొందించబడిన నియామాల క్రింద (రూల్ 8(6) & 9(1) నిబంధన చూడగలరు) క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ప్రకటన

SARFAESI చట్టం, 2002 మరియు అందులో రూపొందించబడిన నియమాల క్రింద ఈ అమ్మకం ప్రకటన జారీ చేయడానికి మరియు అమ్మకం యొక్క అన్ని హక్కులను వినియోగించుకొనుటకు బ్యాంక్ ఆఫ్ ఇండియా అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు పూర్తి హక్కులు కలిగి ఉన్నారు. బ్యాంక్ ఆఫ్ ఇండియా సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖాపెట్టిన/చార్జ్ చేసిన, బ్యాంక్ ఆఫ్ ఇండియా అధీకృత అధికారిచే నిర్మాణాత్మక / భౌతిక స్వాధీనం చేసుకొనబడినట్టి దిగువ వివరించబడిన స్థిరాస్తులు దిగువ వివరించబడిన ఋణగ్రహీతలు మరియు హామీదారులు/ తనఖాదారుల నుండి బ్యాంక్ ఆఫ్ ఇండియా సెక్యూర్డ్ క్రెడిటార్‌కు చెల్లించవలసిన దిగువ వివరించబడిన బకాయిలను రాబట్టుకొనుటకు "ఎక్కడ ఎలా ఉన్నది అలా", "అక్కడ ఏమున్నదో అది" మరియు "అక్కడ ఉన్నది ఉన్నట్లు" ప్రాతిపదికన 10.03.2025 తేదీన ఇ-వేలం ద్వారా విక్రయించబడునని మీకు / ఋణగ్రహీతలకు / హామీదారులకు / తనఖాదారులకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది.

1) సాధారణ ప్రజానీకం మరియు ఆసక్తిగల కొనుగోలుదారులు ఏదేని ఆస్తి కొనుగోలుకు సంబంధించి బిడ్‌లో పాల్గొనుటకు ఏదేని విచారణ కొరకు మరియు ఇందుకు సంబంధించి అన్ని ఇతర విషయాల కొరకు (నియమ నిబంధనలో తెలిపిన విధంగా వారి ఆన్‌లైన్ బిడ్ దాఖలు చేయుట మినహా) లేదా ఏదేని విచారణ వివరాలు పొందుటకు పైన తెలిపిన శాఖను సంప్రదించవలసినదిగా సూచించబడుచున్నారు. 2) మూడవ పార్టీలకు చెల్లించవలసిన ఏదేని దాని కొరకు లేదా ఇందుకు సంబంధించి ఏదేని మూడవ పార్టీతో కాగోరు కొనుగోలుదారులు, సాధారణ ప్రజానీకం ఏదేని వ్యవహారాలు జరిపితే దానికి బ్యాంక్ ఎలాంటి బాధ్యత వహించదు/ జవాబుదారీ కాదు అని సాధారణ ప్రజానీకం/ ఆసక్తిగల కొనుగోలుదారులను హెచ్చరించడమైనది. అది వారి సొంత బాధ్యత మరియు వ్యయ ప్రయాసలపై నిర్వహించుకొనవచ్చును. 3) బిడ్డింగ్ ప్రాసెసింగ్ కోట్ చేసిన వారి అంతిమ బిడ్ మొత్తాన్ని మాత్రమే బ్యాంకుకు ఆస్తి యొక్క కృతార్థ బిడ్డరుచే మొత్తం చెల్లించబడాలని తెలియజేయడమైనది (నియమ నిబంధనల ప్రకారం) + వర్తించు పన్నులు (అమ్మకం సర్టిఫికెట్ నమోదు నిమిత్తం TDS, స్టాంపు డ్యూటీ, చార్జీలు/ఫీజులు బిడ్డరుచే విడిగా చెల్లించబడాలి. 4) ఏదేని SRO వద్ద ఆస్తి రిజిస్ట్రేషన్‌కు సంబంధించి బ్యాంక్‌కు తెలియరాని ఏదేని నిషేధం ఉన్నదేమోనని ఆస్తి నమోదు గురించి తమకుతాము కొనుగోలుదారులు సంతృప్తి చెందవలెను. 5) కాగోరు బిడ్డర్లు బిడ్ దాఖలు చేసే ముందు ఆస్తిపై ఏవేని చట్టబద్ధమైన / ప్రభుత్వ / మునిసిపాలిటీ క్లెయిమ్‌లు అనగా ఆస్తి పన్ను, ఎలక్ట్రిసిటీ, వాటర్, వెల్ఫేర్ అసోసియేషన్ నిర్వహణ బకాయిలు లేదా ఏవేని ఇతర బకాయిలు మొదలగు వాటి గురించి వివరాలు పొందవలెను మరియు తమకుతాము సంతృప్తి చెందవలెను. 6) సదరు ఇ-వేలం ఆస్తి / ఆస్తులకు సంబంధించి భవిష్యత్‌లో ఏవేని వ్యాజ్యాలు ఎదురయ్యే విషయంలో సదరు వేలం అట్టి వ్యాజ్యం ఫలితానికి లోబడి ఉంటుందని కాగోరు బిడ్డర్లు గమనించవలెను. 7) కాగోరు బిడ్డర్లు బిడ్ దాఖలు చేసే ముందు సరియైన / స్వతంత్ర విచారణ చేసుకోవలెను.

అమ్మకం తేది & సమయం : 10.03.2025 న ఉ. 11.00 గం. నుంచి సా. 5.00 గం. వరకు (అమ్మకం ముగిసే వరకు బహుళ విస్తరణలతో)

క్ర.సం.	ఋణగ్రహీతలు మరియు గ్యారంటార్ల పేర్లతో పాటు మిగులు బకాయి వివరాలు
1	M/s. శక్తిశ్రీ బయో క్రాప్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్, 403 లెజెండ్ అపార్ట్‌మెంట్, రేణుక ఎన్‌క్లేవ్, రాజ్‌భవన్ రోడ్డు, హైదరాబాద్-82; శ్రీ నవీన్ బెలిదె తండ్రి స్వర్గీయ బి. కామేశ్వర రావు, 403 లెజెండ్ అపార్ట్‌మెంట్, రేణుక ఎన్‌క్లేవ్, రాజ్‌భవన్ రోడ్డు, హైదరాబాద్-82; శ్రీ బెలిదె రాజేందర్ తండ్రి స్వర్గీయ బెలిదె కామేశ్వర రావు, డి.నం.9-9-94, గిర్మాజిపేట, వరంగల్ - 506002, తెలంగాణ - బకాయి మొత్తం: రూ.7,70,57,519.18 ప్లస్ చెల్లించిన ఏవైనా మొత్తాలు తగ్గించుకుని వ్యయాలు, ఖర్చులు వగైరా కలుపుకుని 30.06.2017 నుండి కాంట్రాక్చువల్ రేట్ వంతున వడ్డీ. M/s. క్రోసోల్ క్రాప్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్, 117/ 1వ అంతస్తు, ఈస్ట్ వింగ్, బ్లాక్-2, లైఫ్‌స్టైల్ ప్రక్కన, బేగంపేట, హైదరాబాద్ - 500016; M/s. క్రోసోల్ క్రాప్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్, డి.నం.16-130/12, సర్వే నం.183/1, అసైన్‌మెంట్ నం.1006, 3వ క్రాస్ ఎక్స్‌టెన్షన్, ఆటోనగర్ జెఐఆర్‌డి టాటా ఇండస్ట్రియల్ ఏరియా కానూరు, పెనమలూరు మండలం, విజయవాడ, కృష్ణాజిల్లా - 520007; శ్రీమతి బెలిదె ఉమారాణి భర్త బెలిదె నవీన్, ఫ్లాట్ నం.403, లెజెండ్ అపార్ట్‌మెంట్స్, రేణుక ఎన్‌క్లేవ్, సోమాజిగూడ, రాజ్‌భవన్ రోడ్డు, హైదరాబాద్ - 500082; శ్రీమతి బెలిదె విజయలక్ష్మి అలియాస్ బెలిదె లక్ష్మి, డి.నం.9-9-84, గిర్మాజిపేట, వరంగల్- 506002, తెలంగాణ - బకాయి మొత్తం: రూ.11,03,29,796.19 ప్లస్ చెల్లించిన ఏవైనా మొత్తాలు తగ్గించుకుని వ్యయాలు, ఖర్చులు వగైరా కలుపుకుని 30.06.2017 నుండి కాంట్రాక్చువల్ రేట్ వంతున వడ్డీ
	ఆస్తి వివరణ: శ్రీ బెలిదె రాజేందర్ తండ్రి స్వర్గీయ బెలిదె కామేశ్వర రావు పేరున నమోదైన జాయింట్ సబ్‌రిజిస్ట్రార్ వరంగల్ మరియు వరంగల్ జిల్లా పరిధిలోని మరియు వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని వరంగల్ సిటీ & జిల్లా, గిర్మాజిపేట వద్దగల మునిసిపల్ నం.9-9-84 కలిగిన ఆర్‌సీసీ రూఫ్ నివాస ఇల్లు యావత్తు. మొత్తం ఏరియా విస్తీర్ణం 384.56 చ. మీటర్లకు సమానమైన 460 చ.గజాల విస్తీర్ణం మరియు సరిహద్దులు:- ఉత్తరం: మొదటి పార్టీకి కేటాయించబడిన ఇల్లు (ఇ.నం.9-9-85), దక్షిణం: శివ్వ మల్లయ్య ఇల్లు, తూర్పు: పి. రామలింగం ఇల్లు, పశ్చిమం: 30 అ. రోడ్డు; MOD: 3911/2014 తేది 15.07.2014; SRO: జనగామ; MOD: 6585/2014 తేది 18.11.2014; SRO: జనగామ; MOD: 3597/2015 తేది 28.05.2015; SRO: జనగామ; రిజిస్టర్డ్ పార్టిషన్ డీడ్ డాక్యుమెంట్ నం: 9738/2006 తేది 31.10.2006, SRO: వరంగల్, స్వాధీనం: లాంఛనప్రాయ
	రిజర్వు ధర : రూ.253.00 లక్షలు · బయానా (EMD) : రూ.25.30 లక్షలు · బిడ్ పెరుగుదల మొత్తం: రూ.1.00 లక్ష


నియమ నిబంధనలు: 1) ఆస్తి వివరాలు చూడడానికి https://baanknet.com దర్శించండి. 2) వెబ్‌సైట్ https://baanknet.com ద్వారా 'ఆన్‌లైన్ ఎలక్ట్రానిక్ బిడ్డింగ్' ప్రక్రియ ద్వారా మాత్రమే వేలం అమ్మకం / బిడ్డింగ్ ఉంటుంది. 3) కాగోరు బిడ్డర్లు పోర్టల్ https://baanknet.com/eauction-psb/bidder-registration లో తమ పేర్లను వన్‌టైమ్ రిజిస్టర్ చేసుకొని యూజర్ ఐడి మరియు పాస్‌వర్డ్ పొందవలెను. సదరు పోర్టల్‌లో ఆన్‌లైన్ ఇ-వేలంలో పాల్గొనుటకు వారు అప్పుడు అనుమతించబడతారు. బయానా వారి వాలెట్‌కు డిపాజిట్ చేయబడాలి. 4) ఏ సమయంలోనైనా కనీసం మొదటి బిడ్ పెంపుదల మొత్తం కంటే మీ బిడ్ మొత్తం రిజర్వు ధర కంటే ఎక్కువగా ఉండాలి మరియు బిడ్లు పై తెలిపిన పోర్టల్ ద్వారా ఆన్‌లైన్ విధానంలో దాఖలు చేయాలి మరియు బిడ్డరు ఇ-వేలంలో పాల్గొనుటకు బయానా కొరకు వారి వాలెట్‌లో తగిన బ్యాలెన్స్‌ను కలిగియుండవలెను. 5) కాగోరు బిడ్డర్లు ఇ-వేలంలో పాల్గొనుట మరియు నమోదు కొరకు చెల్లుబాటుగు ఇ-మెయిల్ చిరునామా & మొబైల్ నం. కలిగి ఉండవలెను. 6) బిడ్డర్లు ఇ-వేలం అమ్మకంలో పాల్గొనుట మరియు వారి బిడ్లు దాఖలు చేయుటకు ముందు ఇ-వేలం అమ్మకం సవివర నియమ నిబంధనల కొరకు మా వెబ్‌సైట్ https://www.bankofindia.co.in/Tender దర్శించవలసిందిగా సూచించబడుతున్నారు. 7) సెక్యూర్డ్ క్రెడిటార్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెబ్‌సైట్ https://www.bankofindia.co.in/ లో ఏర్పాటు చేయబడిన నియమ నిబంధనలకు లోబడి అమ్మకం ఉంటుంది. 8) సంబంధిత శాఖ యొక్క ముందస్తు అనుమతితో ఆస్తిని తనిఖీ చేసుకొనవచ్చును. సంప్రదించాల్సిన వారి వివరాలు పైన పొందుపర్చబడినవి. 9) అమ్మకం క్రింద కొనుగోలుదారులకు ఏవేని భూములను డీమార్కేట్ చేయడానికి బ్యాంకు బాధ్యత వహించదు.

గమనిక: కృతార్థులైన బిడ్డర్లు బయానాతో కలుపుకొని అమ్మకం ధరలో 25 శాతాన్ని అమ్మకం యొక్క అదే రోజున లేదా మరుసటి పని రోజుకు మించకుండా చెల్లించవలెను మరియు అమ్మకం ధరలో మిగిలిన మొత్తాన్ని వారికి అమ్మకం తెలియజేయబడిన యొక్క అంగీకారం / నిర్ధారణ నుండి 15 రోజులలోగా చెల్లించవలెను. పైన పేర్కొన్న నిర్దేశిత గడువులోగా మొత్తంలో 25% మొత్తాన్ని లేదా మిగతా మొత్తాన్ని చెల్లించడంలో విఫలమైనచో, అమ్మకం రద్దు చేయబడును మరియు ఈ బిడ్‌కు సంబంధించి బిడ్డర్లచే డిపాజిట్ చేయబడిన మొత్తం బిడ్డర్లకు ఎలాంటి తదుపరి నోటీసు లేకుండా జప్తు చేసుకోబడును. ఈ విషయంలో బిడ్డర్ల ఆస్తి సంబంధించి లేదా అందులో భాగానికి అన్ని క్లెయిమ్‌లు వదులుకోవలసి ఉంటుంది. తదుపరిగా ఆస్తి విక్రయించబడును మరియు సఫలీకృత బిడ్డర్‌కు ఎలాంటి వడ్డీ చెల్లించబడదు మరియు తదుపరిగా ఎట్టి పరిస్థితులలోను బిడ్డర్లచే వడ్డీ చెల్లింపు కొరకు ఎలాంటి క్లెయిం చేయబడదు.

తేది: 28.01.2025, ప్రదేశం : హైదరాబాద్ — సం/- అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ ఇండియా

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



ములుగు

మంగళవారం 28 జనవరి 2025

మిరపకు తెగులు.. రైతుకు దిగులు

● వైరస్ సోకి వాడిపోతున్న మొక్కలు ● పనిచేయని పురుగు మందులు ● ఆందోళనలో అన్నదాతలు ● పట్టించుకోని సంబంధిత అధికారులు, శాస్త్రవేత్తలు



ఏటూరునాగారం మండలం రామన్నగూడెం గ్రామంలో వైరస్ సోకడంతో వాడిపోతున్న మిర్చి మొక్కలు

ఏటూరునాగారం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మిర్చి (ఎర్ర బంగారం) పంటకు ముప్పు ముంచుకొస్తోంది. ఆరుగాలం కష్టం చేసి తీరా చేతికొచ్చే దశలో పంటకు తెగులు రూపంలో ప్రమాదం రావడంతో రైతన్న ఆందోళన చెందుతున్నారు. ఒక వైపు వైరస్ తెగులు, మరో వైపు వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పుల ప్రభావం దిగుబడిపై గుదిబండలా మారాయి. ఒక మొక్కకు వైరస్ సోకితే రెండు, మూడు రోజుల్లోనే తోటంతా వ్యాపిస్తోందని రైతులు కన్నీరు మున్నీరువుతున్నారు. మొక్కలన్నీ వాడిపోయి ఎండిపోతున్నాయని రైతులు లబోదిబోమంటున్నారు. రూ.వేల విలువైన పురుగు మందులు పిచికారీ చేసినా ఫలితం ఉండటంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాగు కోసం ఇప్పటికే ఎకరానికి కౌలుతో పాటు సుమారు రూ. 1.5 లక్షలు ఖర్చు చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. ఇంత జరుగుతున్నా సూచనలు, సలహాలు ఇచ్చే వ్యవసాయ శాఖ శాస్త్రవేతలు, అధికారులు జాడలేరని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రపంచంలో నాణ్యత కలిగిన మిర్చి పంటను అంతర్జాతీయ గుర్తింపు పొంది సాగు చేసే ఏటూరునాగారం మండలం రామన్నగూడెం, రాంనగర్, పప్కాపురం, లంబాడితండా, కొయగూడా ఎల్లపూరం, రొయ్యూరు, శంకరాజుపల్లి, ముల్లెకట్ట, రాంపూర్, చల్పాక, బానాజీబంధం, కన్నాయిగూడెం మండలం కంతనపల్లి, ఏటూరు, సింగారం, ముప్పనపల్లి, గూర్రేవుల, లక్ష్మీపురం, దేవాదుల, రాజన్నపేట, వీరాపూర్‌తో పాటు మంగపేట, వాజేడు, వెంకటాపురం మండలాల్లో ఆరు వేల ఎకరాలకు పైగా మిర్చి సాగవుతోంది. కాగా, తదిరత ప్రాంతాల రైతుల పంటలకు తెగులుదెబ్బ పడుతోంది. అనుభవంతో పాటు గుర్తింపు ఉన్న రైతులు ఈ తెగులును ఎదుర్కొనేందుకు తలలు పట్టుకుం టున్నారు.

కుళ్లు వైరస్‌తో పంటలకు ముప్పు...

ఏజెన్సీ మండలాల్లోని గ్రామాల్లో సాగు చేసిన మిర్చి పంటకు వైరస్ సోకి వందలాది ఎకరాల పంటలు ఎందుకు పనికిరాకుండా పోతున్నాయని రైతులు గగ్గోలు చెందుతున్నారు. గత ఏడాది తామర పువ్వు తెలుళ్లతో పలు చోట్ల పంటలు నాశనమయ్యాయి. దీంతో రైతులు ఆర్థిక నష్టాలను చవిచూశారు. ఈ ఏడాది ఆరంభంలోనే గాదావరి వరదలు రావటంతో కుళ్ల తెగుళ్ల వ్యాపించాయి. గత నెల రోజుల క్రితం నాటిర తోటలకు వైరస్ సోకి మొక్క వేర్లు కుళ్లి పోతున్నాయని రైతులు వాపోతున్నారు. దీంతో రైతులు రూ. వేలు ఖర్చు చేసి ఏరు‘ంపెనీ పెరు చెబితే ఆ మందులు తెచ్చి పిచికారీ చేస్తున్నారు.

జాడలేని శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు

పంటలకు వైరస్ సోకి మిర్చి మొక్కలు వాడిపోతున్నప్పటికీ రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వాల్సిన సంబంధిత వ్యవసాయ శాఖ ఏడీ నుంచి సిబ్బంది వరకు విధులకు డుమ్మా కొడుతూ పల్లెలు వీడి పట్టలకు పరిమితమవుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

అంతర్జాతీయంగా గుర్తింపు...

పతి ఏట వేలాది ఎకరాల్లో సాగు చేసిన మిరపకాయలను ముంబాయి, నాగ్‌పూర్, డిల్లీ లాంటి తదితర ప్రాంతాల వ్యాపారులు కొనుగోలు చేస్తారు. అయితే.. ఈ సీజన్‌లో ఆయా గ్రామాల్లోని చిన్న, పెద్ద రైతులు కుటుంబ సభ్యుల సమేతంగా నారుపోసి మొక్కలు నాటిన నుంచి కాయలు కోసి అమ్మకాలు జరిపే వరకు పంట పొలాల్లోనే కాయ కష్టం చేస్తుంటారు. క్రిమి సంహారక మందులను తక్కువ స్థాయి వినియోగించి సేంద్రియ ఎరువులతోనే నాణ్యత కలిగిన ఈ పంట దిగుమతిని పొందుతుండడం వల్లెనే ఇక్కడి మిర్చికి అంతర్జాతీయంగా గుర్తింపు లభించింది.

మిర్చిలో తెగుళ్లతో రైతుల ఇబ్బందులు

మల్హర్ : మిర్చి పంటకు ధర లేక రైతులు ఇబ్బందులు పడుతుంటే పంటకు సోకిన తెగుళ్లతో రైతులు కష్టాలు పడుతున్నారు. మిర్చిలో ప్రస్తుతం కుచ్చు, తామేర, నల్లి తెగుళ్లతో సతమతమవుతున్నట్లు రైతులు తెలుపుతున్నారు. అకాల వర్షాలు కురిసిన తర్వాత మిర్చిలో తెగుళ్ల సోకడం ప్రారంభమైందని రైతులు తెలుపుతున్నారు. ఇప్పటికే ఒక్కో ఎకరానికి రూ లక్ష వరకు పెట్టుబడి పెట్టినట్లు రైతులు తెలుపుతున్నారు. మిర్చిలో కౌలు రైతుల పరిస్థితి మరి దారుణంగా ఉంది. మండల వ్యాప్తంగా సుమారు మూడు వేల ఎకరాల్లో తాడిచర్ల, మల్లారం, చిన్నతూండ్ల, పెద్దతూండ్ల, గాధంపల్లి, కిషన్‌రావుపల్లి, కొండంపేట, రుద్రారం, అన్‌సాన్‌పల్లి, నాచారం, తాడ్వాయితో పాటు పలు గ్రామాల్లో రైతులు మిర్చిని సాగు చేస్తున్నారు. తెగుళ్లకు తోడు పంటకు ధర లేక పోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.



తెగులు సోకిన పంటను చూపుతున్న రైతు

పదెకరాలు సాగు చేశా : అల్లి సుమలత , రైతు



మిర్చి పంటను నమ్ముకొని, వడ్డీ వ్యాపారుల దగ్గర, బ్యాంకు రుణా లు పొంది రూ. 20 లక్షలతో పది ఎకరాల మిర్చి సాగు చేశాను. వాతా వరణ ప్రభావానికి తోడు మిర్చి మంటకు ఎర్ర తెగుళ్ల సోకి మొక్కలు ఎందుకు పనికి రాకుండా పోతోంది. ప్రభుత్వం మమ్మలను ఆదుకోవాలి

సీసీ కెమెరాల ఏర్పాటు

మల్హర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన తాడిచర్ల ఎంపీడీవో కార్యాలయం సమీపంలోని మూలమలుపు వద్ద, ఇప్పలక్రాస్(పెద్దతూండ్ల), కొయ్యూర్ నాగులమ్మ క్రాస్, కిషన్‌రావుపల్లి నుంచి భూపాలపల్లికి వెళ్లే అటవీ మార్గంలో మొత్తం పది సోలార్ సీసీ కెమెరాలను సొమవారం ఏర్పాటు చేసినట్లు ఎస్సై నరేష్ గౌడ్ తెలిపారు. తాడిచర్లలో నాల్గు, ఇప్పలక్రాస్ వద్ద 2, కిషన్‌రావుపల్లిలో 2, నాగులమ్మ క్రాస్ వద్ద 2 ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కొయ్యూర్ పోలీస్ స్టేషన్‌లోని కమాండ్ కంట్రోల్ ద్వార నిరంతరం ఈ రోడ్డు పై నిఘా ఉంటుందని ఆయన తెలిపారు. ప్రమాదాలు, ఇతర సంఘటనలు జరిగిన సమయంలో సీసీ ఫుటేజీ దోహదపడుతుందని ఆయన తెలిపారు.

ఉత్తమ ఉద్యోగులకు పౌర సన్మానం



రైతువేదికలో ఏఈవో ఆస్మాను సన్మానిస్తున్న రైతులు

కాటారం, జనవరి 27(ఆంధ్రజ్యోతి):మండలం నుంచి వివిధ శాఖల్లో విధులు నిర్వహిస్తూ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉద్యోగులుగా ప్రశంసాపత్రాలు పొందిన పలువురికి సోమవారం పౌరసన్మానం చేశారు. రేగులగూడెం రైతు వేదికలో ఏఈవో అస్మా ను క్లస్టర్ పరిధిలోని పలు గ్రామాలకు చెందిన రైతులు ఆత్మీయసన్మానం చేశారు. ట్రాన్స్‌కో సీఎండీ వరుణ్‌రెడ్డి చేతులమీదుగా ఉత్తమ ఉద్యోగి అవార్డు తీసుకున్న లైన్‌మెన్ చంద్రమౌళిని ఏడీఈ నాగరాజు, ఏఈ ఉపేందర్, ఎల్ఐ కిరణ్‌కాంత్, తోటి ఉద్యోగులు అభినందించారు. పీఏసీఎస్ సీఈవో ఎడ్ల సతీష్‌ను సంఘం చైర్మన్ ప్రశాంత్, మాజీ ఎంపీపీ సమ్మయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి చీమల సందీప్, పలువురు డైరెక్టర్లు, తోటి సిబ్బంది శాలువాతో సత్కరించి అభినందించారు. రైతులు, నాయకులు నవీన్‌కుమార్, దేవేందర్‌రెడ్డి, కిష్టయ్య, బాలరాజు, నర్సింహారెడ్డి, రాజ్‌కుమార్, రాజేందర్ పాల్గొన్నారు.

● చిట్యాల : జిల్లా ఉత్తమ అవార్డు గ్రహీత, చట్యాల సివిల్ సప్లై గోదాం ఇన్‌చార్జీ గంగాదర రాజును హమాలీ కార్మికులు సోమవారం కార్యాలయంలో ఘనంగా సన్మా నించారు. గణతంత్ర దినోత్సవం పురస్కరించుకుని ఆదివారం ఎమ్మెల్యే సత్యనారాయణరావు, జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. చిట్యాల హమాలీ కార్మికుల సంఘం అధ్యక్షుడు సరిగొమ్ముల సురేష్, కార్మికులు కట్కూరి కుమార్, శీలపాక నాగరాజు, కట్కూరి శ్రీనివాస్, దాసారపు సృజన్ ఉన్నారు.

అధ్వానంగా హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల నిర్వహణ

● పట్టించుకోని ఫుడ్ సేఫ్టీ అధికారులు

● రోజురోజుకు పెరుగుతున్న రోగాలు

మహేదపూర్, జనవరి 27(ఆంధ్రజ్యోతి) :ఆకలితో టిఫిన్ సెంటర్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్, హోటల్‌కు వెళ్లి తింటున్నారా.. ఇక అంతే సంగతులు జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంతో పాటు మహదేవపూర్ మండలంలోని పలు హోటళ్ల, టిఫిన్ సెంటర్, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో నిత్యం వాడిన నూనె వాడుతూ ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారు. మండలంలో ఆయా హోటళ్ల, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో వంటకాలకు వాడిన నూనె వాడడంతో మేడి పండు చూడు మేలిమై ఉండును పొట్ట విప్పి చూడు పురుగులుండు అనే చందంగా తినే ఆహారం నిత్యం కల్తీ జరుగుతున్నా పట్టించుకోవడం లేదు. కల్తీ నూనెతో పూరీ, బోండా, వడ ఇలాంటి పదార్థాలతో తినడానికి రుచికరమైన వంటలు కనిపిస్తున్నాయి. కాని తెలుసుకోవాల్సిన విషయం ఏమిటంటే..! వాడిన నూనెను మళ్లీ వాడుతుండడం .. మిగిలిన నూనె మరుసటి రోజు వాడడంతో కాకుండా చట్నీలు, సాంబార్ మిగిలిన వాటితో మరుసటిర రోజు వాడుతున్నారు. అలాంటింది కల్తీ నూనె కాకుండా రాత్రి సమయంల్లో మిగిలిన పదార్థాలను మరుసటి రోజు నిలువ ఉంచిన చికెన్, మటన్, చేపలు ఇలాంటివి నానిరకం కల్తీనూనెతోనే తయారు చేస్తుండడం గమనార్హం.

కరోనా తర్వాత జనం తినే విధానంలో మార్పు వచ్చింది. కోవిడ్ వచ్చి ఉపశమనం పొందిన వారిలో చాలామందికి రుచి సరిగ్గా తెలియడం లేదు. దీంతో అధిక ంగా నూనేలు వాడే వంటకాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. నూనె పదర్థాల కోసం హోటళ్లను ఆశ్రయించే వారి సంఖ్య భారీగా పెరిగింది. ఇదే అదునుగా కొన్ని చోట్ల వంట నూనెల్లో కల్తీ జరుగుతోంది. ఈ పరిణామం ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. హోటళ్ల, రెస్టారెంట్లు, శుభ్రత కల్తీ వంటి వాటిని గాలికి వదిలేసి సంపాదనే ధ్యేయంగా ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించడం పట్ల అంతర్యమేమిటో ఆలోచించాల్సిన విషయం..





పదార్థాల తయారీకి వినియోగిస్తున్న కల్తీ నూనె, ఆహార పదార్థాలు

మృతుల కుటుంబాలకు పరామర్శ

ఏటూరునాగారం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మృతుల కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు చిటమట రఘు అన్నారు. సోమవారం మంత్రి సీతక్క ఆదేశాల మేరకు కాంగ్రెస్ మండల పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రానికి చెందిన గంజి రంజిత్ ఉరేసుకొని మృతి చెందగా ఆయన కుటుంబాన్ని పరామర్శించి పార్థివదేహానికి సంతాపం తెలిపారు. అంతేకాకుండా మండలంలోని రాంనగర్ గ్రామానికి చెందిన గడబోయిన సత్యనారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. అదేవిధంగా ఆకులవారిణపురంకు చెందిన గంపల రవి అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెసుకున్న పార్టీ మండల నాయకులు మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి, మృతుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా రఘు మాట్లాడుతూ.. మృతుల కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని, పార్టీ పరంగా అన్ని విధలుగా ఆదుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గుడ్ల దేవేందర్, కన్నాయిగూడెం మాజీ జడ్పీటీసీ చందు, పీఎసీఎస్ వైస్ చైర్మన్ చెన్నూరి బాలరాజు, మండల ప్రధాన కార్యదర్శి వావిలాల ఎల్లయ్య, యూత్ మండల అధ్యక్షుడు గద్దల నవీన్, మాజీ వార్డు మెంబర్ కె. రంజిత్, ఎమ్డీ. గౌస్ పాల్గొన్నారు.

స్క్రాప్ దుకాణాల్లో కూలీలకు రక్షణ కరువు



భద్రత లేకుండా పనిచేస్తున్న కూలీలు

కాకతీయఖని, జనవరి 27(ఆంధ్రజ్యోతి): స్క్రాప్ దుకాణాలలో పనిచేసున్న కూలీలకు రక్షణ కరువైంది. దుకాణ యజమానులు రక్షణ పరికరాలను అందించకుండా వారితో వెట్టి చాకిరి చేపిస్తు న్నారు. తుప్పు పట్టిన ఇనుప సామన్లు, చెదలు పట్టిన పుస్తకాలు, దుమ్ము పట్టిన అట్టలు, పాడైపోయిన ప్లాస్టిక్ వస్తువులు తదితర సామాన్లను డీసీఎం, ట్రాలీ ఆటోల్లో కూలీలు లోడ్ చేస్తున్న క్రమంలో వారికి చేతి గ్లౌజ్‌లు, తలకు టోపీ, మూతికి మాస్క్, కాళ్లకు బూట్లు అందించాల్సి ఉంది. అయితే భూపాలపల్లి పట్టణంలోని స్క్రాప్ దుకాణ యజమానులు కూలీలకు అవేం ఇవ్వకుండానే వారితో పని చేపిస్తుండంతో తరుచూ గాయాల పాలవుతున్నారు. అలాగే రోగాల బారినపడి ఆస్పత్రుల వెంట తీరగాల్సిన పరిస్థితి వస్తుందని వారు ఆవేదన చెందుతున్నారు. ఇటీవల ఓ కూలీ స్క్రాప్ దుకాణంలో పనిచేస్తున్న క్రమంలో పాము కరిచి మరణించినట్లు పలువుర చెబుతున్నారు. పెద్ద పెద్ద ఇనుప సామాను వస్తే వాటిని గ్యాస్ కట్టర్ ద్వార కట్ చేయాల్సి ఉంది. ఎలాంటి సేఫ్టీ లేకుండా పనిచేస్తున్నారు. దీంతో కండ్లు దెబ్బతింటున్నాయని చెబుతున్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

వెంకటాపూర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉపాధ్యాయులు, ఉద్యోగులకు సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ టీఎస్ పీఆర్టీయూ మండలశాఖ ఆధ్వర్యంలో నాయకులు సో మవారం స్థానిక తహసీల్దార్ గిరిబాబుకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా సంఘం మండల అధ్యక్షుడు అడిచెర్ల రాజయ్య మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని పేర్కొ ందని అన్నారు. రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, ఝూర్ఖండ్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో పాత పెన్షన్ విధానం అమలు జరుగుతుందని గుర్తుచేశారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు బండి సురేష్ మాట్లాడుతూ 35ఏళ్లపాటు సేవలందించిన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఉద్యోగ విరమణ అనంతరం వారి శేష జీవితం సుఖసంతోషాలతో ఉండాలంటే ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలని, అంతేకాకుండా ఏప్రిల్ 1, 2025 నుంచి అమలుపరుస్తున్న సమీకృత పెన్షన్ విధానాన్ని ఎట్టి పరిస్థితుల్లో ఒప్పుకునేదిలేదని అన్నారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పెండ్యాల సలేంద్రం, పావుశెట్టి శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి చిట్టిబొమ్మల శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు కనుకుంట్ల కిషోర్‌బాబు, మ ండల కార్యదర్శి పోతునూరి రమేష్, సోషల్ మీడియా కన్వీనర్ రాజేందర్ పాల్గొన్నారు.

● వాజేడు : కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం(సీపీఎస్) విధానాన్ని రద్దుచేసి యూపీఎస్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ టీఎస్ పీఆర్టీయూ మండల అధ్యక్షుడు పోరిక స్వరూప్‌సింగ్ ఆధ్వర్యంలో నాయకులు సోమ వారం స్థానిక తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా స్వరూప్‌సింగ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఓల్డ్ పెన్షన్‌స్కీం(ఓపీఎస్)ను పునరుద్ధరించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్‌రావు, సంఘం నాయకులు కోకిల శ్రీరంగం, కంచు ప్రభాకర్, ఆక దామోదర్, నునావత్ రాజేష్, సంతోష్, చంద్రశేఖర్, పోరిక రవి, ఆనంద్ పాల్గొన్నారు.

● టేకుమట్ల : రాష్ట్ర ప్రభుత్వం మేనిఫెస్టోలో చెప్పిన విధంగా పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పీఆర్‌టీయూ టీఎస్ మండల నాయకులు తహసీల్దార్ విజయలక్ష్మికి సోమవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆ సంఘం మండల అధ్యక్షుడు ఎండి హాకీమ్ మాట్లాడుతూ ...నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాతన పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని అయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల ప్రధాన కార్యదర్శి పప్పుల సునీల్, జగన్నాథం, తోట మహేందర్, మేకల సదయ్య, ముత్యంరెడ్డి, సోమిడి స్వామి, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

● చిట్యాల : ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానంను పునరుద్ధరించాలని పీఆర్టీయూ టీఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహసీల్ కార్యాలయం ఉద్యోగికి వినతిపత్రం అంధజేశారు. ఈసందర్భంగా సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు బండి శ్రీనివాస్, సూధం సాంబమూర్తి మాట్లాడుతూ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం, యునిఫైడ్ పెన్షన్ స్కీంను వ్యతిరేకిస్తున్న తెలిపారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గోవిందుల సత్యనారాయణ, రాష్ట్ర, జిల్లా బాధ్యులు రాంనారాయణ, కూచనపల్లి శ్రీనివాస్, రమేష్, రహీంపాషా, నూకల లింగయ్య, చిరంజీవీ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న పీఆర్టీయూ నాయకులు



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న పీఆర్టీయూ నాయకులు



టేకుమట్లలో తహసీల్దార్ విజయలక్ష్మికి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

నకిలీ మందులు అమ్మిన వ్యక్తిపై కేసు నమోదు

టేకుమట్ల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మందలోరిపల్లి గ్రామంలో నకిలీ పురుగు మందులు అమ్మకాలు చేస్తూ పట్టుబడిన వ్యక్తిపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. వ్యవసాయాధికారి కళ్యాణి, ఎస్సై సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం మందలోరిపల్లిలో నల్లగొండ జిల్లాకు చెందిన బొంగు శ్రీలత అనే మహిళ నీమ్ అయిల్ బయోప్రోడక్ట్ అని, మిర్చి పంటకు అన్ని రకాలుగా పని చేస్తుందని చెప్పి రైతులకు అమ్మకాలు చేస్తూ పట్టుబడినట్లు తెలిపారు. ఆమె అమ్మకాలు చేస్తూ కంపెనికి సంబంధించిన అనుమతి పత్రాలు గానీ, కంపెనీ పేరుతో రిజిస్ట్రేషన్ పత్రాలు గాని లేవని తెలిపారు. తన వద్ద పట్టుబడిన పురుగు మందులను స్వాధీనం చేసుకొని ఆమెపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు.

పదవీకాలం ముగిసిన కౌన్సిలర్లకు సన్మానం

భూపాలపల్లి కృష్ణకాలనీ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి మునిసిపాలిటీలో గత ఐదేళ్ల కౌన్సిలర్లుగా కొనసాగి పదవి ముగిసిన బీఆర్‌ఎస్ కౌన్సిలర్లను మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి సోమవారం సత్కరించారు. బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి శాలువా పూలమాలతో సత్కరించారు. పదవి లేకున్నా ప్రజల్లో ఉంటూ పార్టీ పటిష్ఠతకు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ వెంకటరాణి, మాజీ వైస్ చైర్మన్ గండ్ర హరీష్‌రెడితో పాటు జంగేడు పీఏసీఎస్ చైర్మన్ మేకల సంపత్‌యాదవ్, మాజీ కౌన్సిర్లు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

రేపు నిరంతర విద్యుత్‌పై సమీక్ష

భూపాలపల్లిటౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలంలో నిరంతరంగా విద్యుత్ సరఫరా చేసేందుకు గాను ఈ నెల 29న నోడల్ అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు ఎస్ఈ మల్చూర్‌నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా క్షేత్రస్థాయిలో నిరంతర విద్యుత్ అందించడంలో భాగంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో ఈ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ప్రతి సర్కిల్ నోడల్ అధికారి పాల్గొనాలని సూచించారు.

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సంబరాలు

కాటారం, జనవరి 27(ఆంధ్రజ్యోతి):మండలకేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో ఎమ్మార్పీఎస్ నాయకులు సోమవారం సంబరాలు నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మంథెన చిరంజీవి ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేస్తూ సంబరాలు జరిపారు. అత్యున్నత పురస్కారమైన పద్మశ్రీని సామాజిక ఉద్యమనేత మంద కృష్ణకు ఇవ్వడం మాదిగజాతికి గర్వకారణమన్నారు. ఫిబ్రవరి 7న నిర్వహించే వేయి గొంతులు లక్ష డప్పులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చిరంజీవి అన్నారు. సంఘం నాయకులు మహేష్, చిన్ని, విక్రం, కిరణ్, శ్రీనివాస్, కొండయ్య ఉన్నారు.

నాయకపోడ్ యువతకు టీ షర్టుల పంపిణీ

కాటారం, జనవరి 27(ఆంధ్రజ్యోతి):మండలంలోని శంకరంపల్లి తాజా మాజీ సర్పంచ్ అంగజాల అశోక్ రాబోయే గొంతెమ్మగుట్ట లక్ష్మీదేవర జాతరలో వలంటీర్లుగా పాల్గొనే ఆదివాసీ నాయకపోడ్ యువతకు సోమవారం టీ షర్టులు పంపిణీ చేశారు. జాతరలో భక్తులకు సేవలందించడానికి విధులు నిర్వహించే 30మంది ఆదివాసీ యువతీయువకుల కు అశోక్ టీ షర్టులను అందించారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ దుద్దిళ్ల శ్రీనుబాబులతో కూడిన ఫోటోలను ముద్రించిన టీ షర్టులను కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్ నాయకుల చేతులమీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు తిరుపతి, శ్రీకాంత్, శ్రీను, రంజిత్, రవి, మల్లేష్, మహేష్, రాజు రవితేజ, నాయకపోడ్ సంఘం అధ్యక్షుడు కోలకాని లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ఏటూరునాగారం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మానసపల్లికి చెందిన గంపల రవి అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ములుగు జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనరసింహారావు మృతుడి కుటుంబానికి దహన సంస్కారాల నిమిత్తం రూ. 5,000 ఆర్థిక సహాయం బీఆర్‌ఎస్ మండల పార్టీ నాయకుల ద్వారా సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయ కులు తుమ్మ మల్లారెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఎమ్డీ. ఖాజా పాషా, నాయకులు జాడి బోజారావు, కాళ్ళ రామకృష్ణ, గుండేపల్లి సర్వయ్య పాల్గొన్నారు.

గుండెపోటుతో బీజేపీ మాజీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ మృతి



నర్సింహారావు శవయాత్రలో పాల్గొన్న నాయకులు

మంగపేట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నడిమిగూడెం గ్రామానికి చెందిన బీజేపీ మాజీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ చౌలం నర్సింహారావు(62) సోమవారం ఉదయం గుండెపోటుతో మృతిచెందారు. ఆయన మృతి పట్ల బీజేపీతోపాటు వివిధ కులసంఘాలు, రాజకీయపార్టీల నాయకులు శ్రద్ధాంజలి ఘటించి శవయాత్రలో పాల్గొన్నారు. ఈసందర్భంగా పలువురు నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆదివాసీ ఉద్యమంలో గత 35 ఏళ్లుగా పలు పోరాటాలు చేసిన నర్సింహారావు ఆకస్మికంగా మృతిచెందడం బాధాకరమని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్, వివిధ కులసంఘాల నాయకులు గుమ్మడి సోమయ్య, శ్రీధర్‌వర్మ పాల్గొన్నారు.

ఇంకెన్నాళ్లు..?

(5వ పేజీ తరువాయి)

నత్తనడకన సాగుతున్నాయి. ప్రభుత్వం మంజూరు చేసిన 63 సబ్ సెంటర్లలల్లో 47 సబ్ సెంటర్లు ఎన్‌హెచ్‌ఎం నిధులు, 11 సబ్ సెంటర్లకు డీఎంఎఫ్‌టీ, 2 సబ్‌సెంటర్లను ఏటీడీఏ నిధుల నుంచి నిర్మిస్తున్నారు. దాదాపు 2021 నుంచి ప్రారంభం అయిన సబ్ సెంటర్ల నిర్మాణాలు ఇంకా సాగుతునే ఉన్నాయి. 63 సబ్ సెంటర్లను నిర్మించాలని సంకల్పిస్తే అందులో 40 సబ్ సెంటర్ల పనులు మాత్రమే ప్రారంభమయ్యాయి. ఇందులో 17 సబ్ సెంటర్ల పనులు మాత్రమే ప్రారంభం కాగా 23 నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. మిగిలిన 23 సబ్ సెంటర్లలల్లో 9 నిర్మాణాలకు ఆర్థిక అనుమతులు రాక పక్కన పెట్టారు. మరో 7 నిర్మాణాలు ప్రారంభం కాలేదు. 6 నిర్మాణాలకు స్థలం లేకపోవడంతో నిలిచిపోయాయి. ఒక్క నిర్మాణంకు అసలు టెండర్ వేయనేలేదు. పనులు ప్రారంభించిన నిర్మాణాలు కుడా పూర్తి అలసత్వంతో నెమ్మదిగాసాగుతున్నాయి. అన్ని ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న సామెత మాదిరిగా సబ్ సెంటర్ల నిర్మాణం తయారైంది. 63 సబ్‌సెంటర్లల్లో 6 సబ్ సెంటర్లు కేవలం స్థలం సమస్య కారణంగా నిర్మాణాలు ప్రారంభం కాలేదు. టెండర్ పూర్తయిన వాటికి రెవెన్యూ, పంచాయితీ రాజ్ అధికారుల అలసత్వం వల్ల పనులు ఇంకా ప్రారంభం కాలేదు. మరోవైపు నిధులలేమితో 16 సబ్‌సెంటర్ల నిర్మాణాలు పూర్తిగా ప్రారంభమే కాలేదు.

కలెక్టర్ ఆగ్రహం

సబ్ సెంటర్ల నిర్మాణంలో జరుగుతున్న జాప్యంపై కలెక్టర్ రాహుల్‌శర్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంకెన్నళ్ల నిర్మాణాలు కడుతారంటూ అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. ఇటీవల కలెక్టరేట్‌లో వైద్యఆరోగ్యశాఖ, పంచాయితీరాజ్, టీజీఎండీసీ ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించిన కలెక్టర్ సబ్ సెంటర్ల నిర్మాణంపై సమీక్షించారు. భాగిర్తిపేట, చెన్నపురం, రంగయ్యపల్లి, సుల్తాన్‌పూర్ నిర్మాణం 2022 నవంబర్ నాటికే పూర్తి చేయాల్సి ఉండగా ఇంకా ఎందుకు పూర్తి చేయాలేదని సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్ ఆదేశాలతో అధికారులు నిర్మాణాలను వేగవంతం చేసి ప్రజలకు అందుబాటులో తెస్తారో లేక వారి అలసత్వంతో ప్రజలకు వైద్యాన్ని దూరం చేస్తారో చూడాల్సి ఉంది.

వేగంగా నిర్మాణాలు పూర్తి చేస్తాం



జిల్లాలో నిర్మిస్తున్న సబ్ సెంటర్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేస్తాం. నిర్మాణాల పూర్తి చేయడంపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీచేశాం. పనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్‌లను తొలగించి వేరే వారితో పనులను వేగంగా పూర్తి చేస్తాం.